PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 229 | విజయవాడ, శనివారం 22 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 22 March 2025 | Rs

నేటినుంచి ఐపిఎల్ సంగ్రామం

- ప్రారంభోత్సవ వేడుకలకు ఈడెన్ గార్డెన్స్ సిద్ధం
- కోల్‌కతా-బెంగళూరు మ్యాచ్‌తో సీజన్-18 ఐపిఎల్ ప్రారంభం
- రాత్రి 7.30గం॥లకు స్టార్‌స్పోర్ట్స్‌లో

8



కథలే.. కథలు..!

24 గంటల కథా మారథాన్

నేటి సాయంత్రం 5.30 గంటల నుంచి

యూట్యూబ్ ఛానెల్ 'బి ప్లస్ విత్ భాస్కర్'లో..

వందమందికి పైగా కథకులు, రచయితల భాగస్వామ్యం

7



అన్నదాన సత్రంలో యాత్రికులకు స్వయంగా వడ్డిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. పక్కన మనుమడు దేవాన్ష్

టిటిడిలోని అన్యమతస్తులను

బదిలీ చేస్తాం

- ముంతాజ్ హోటల్, ఎంఆర్, దేవలోక్ ప్రాజెక్టులకు భూ కేటాయింపులు రద్దు
- దేశంలోని అన్ని రాజధానుల్లోనూ శ్రీవారి ఆలయాలు : ముఖ్యమంత్రి చంద్రబాబు
- మాతృశ్రీ అన్నదానం భవనంలో యాత్రికులకు స్వయంగా వడ్డన

ప్రజాశక్తి- తిరుమల


టిటిడిలో పనిచేస్తోన్న అన్యమతస్తులను బదిలీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. వారికి మరోచోట అవకాశం కల్పిస్తామన్నారు. ఎవరి మత సంస్థల్లో వారే పనిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలిపిరి సమీపంలోని ముంతాజ్ హోటల్, ఎంఆర్, దేవలోక్ ప్రాజెక్టులకు కేటాయించిన భూములను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాజధానుల్లోనూ శ్రీవేంకటేశ్వర ఆలయాలను టిటిడి ఆధ్వర్యాన నిర్మిస్తామన్నారు. ప్రపంచంలో హిందువులు ఎక్కువగా ఉన్న దేశాల్లోనూ ఈ ఆలయాల నిర్మాణం చేపడతామని చెప్పారు. తన మనవడు నారా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా చంద్రబాబు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. తిరుమలకు శుక్రవారం వచ్చిన యాత్రికులకు అన్నదానం కోసం అయిన ఖర్చు రూ44 లక్షలను ఆయన భరించారు. మాతృశ్రీ అన్నదానం భవనంలో యాత్రికులకు నేరుగా చంద్రబాబు వడ్డించారు. కుటుంబ సమేతంగా ఆయన అక్కడే భోజనం చేశారు. అనంతరం తిరుమలలోని శ్రీ పద్మావతి అతిథి గృహంలో మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవని అన్నారు. శ్రీవారి సేవను మరింత పకడ్బందీగా అమలు చేసేలా ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. అమరావతిలో శ్రీనివాస కల్యాణోత్సవం ద్వారా నూతనోత్సాహం, నమ్మకం పెరిగిందన్నారు. శ్రీవారి ఆశీస్సులతో రాజధాని అమరావతిని పున్ణనిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. టిటిడిలో ఎలాంటి వ్యాపారాత్మక నిర్మాణాలు చేపట్టరాదన్నారు. శ్రీవారి పవిత్రతను కాపాడేందుకు మిగతా 7లో

మళ్లీ కసరత్తు!

విశాఖ-కాకినాడ మధ్య పిసిపిఐఆర్ కారిడార్

గంగవరం పోర్టు నుంచి కాకినాడ పోర్టు వరకూ రూ.43 వేల కోట్ల ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్

8 నెలల వ్యవధిలో మాస్టర్ ప్లాన్, పర్‌స్పెక్టివ్ ప్లాన్



పిసిపిఐఆర్ కారిడార్ మాస్టర్ ప్లాన్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

సుమారు 18 ఏళ్ల క్రితం ప్రతిపాదించిన విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రో కెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వికె-పిసిపిఐఆర్ ఎస్‌డిఎ) తాజాగా విశాఖ-కాకినాడ తీరాన్ని తాకే కారిడార్‌కు సిద్ధమవుతోంది. వాస్తవానికి 2008 ఆగస్టు 24న జిఒ నెంబర్ 373 మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ డిపార్టుమెంట్ ఉత్తర్వుల మేరకు దీని ఏర్పాటు జరిగింది. అప్పట్లో వైఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రతిపాదించిన దీనికి తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం అమలుకు సన్నాహాలు చేసింది. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం దీన్ని కొనసాగించాలని చూసింది. మొత్తంగా ఈ రీజియన్ నడక మధ్య మధ్యలో ఆగినట్టు అనిపించినా నెమ్మది నెమ్మదిగానే కదులుతూ ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వంలో పూర్తి స్థాయి కార్యాచరణకు సిద్ధం అవుతున్నారు.

తీర ప్రాంత 'కారిడార్'గా వికె పిసిపిఐఆర్

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (విఎంఆర్‌డిఎ) అధికారులను వికె పిసిపిఐఆర్ కార్యాచరణకు రంగంలోకి దింపింది. సముద్ర ఉత్పత్తులు, పరిశ్రమలు, తీరాన్ని ఆనుకుని ఉన్న సంస్థల ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతుల కోసం దీన్ని ప్రతిపాదిస్తున్నారు. గంగవరం పోర్టు నుంచి తీర ప్రాంతంలోని నక్కపల్లి మండలం మీదుగా కాకినాడ వరకూ ఇది సాగనుంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పడే బల్క్ డ్రగ్ పార్క్, పూడిమడక-అచ్యుతాపురం మధ్య నిర్మితమయ్యే ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ సహా మరిన్ని తీర ప్రాంత పరిశ్రమలకు ఆస్కారమిచ్చేలా వికె పిసిపిఐఆర్ కారిడార్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. లక్షల ఉద్యోగాలు, రూ.43,744 కోట్ల పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా కార్యాచరణ మొదలైనట్టు ప్రభుత్వం చెబుతోంది. రాబోయే ఎనిమిది నెలలల్లో మాస్టర్ ప్లాన్‌ను తాజా పరిచి పర్‌స్పెక్టివ్ ప్లాన్ రూపొందించాలని గడువు విధించింది. 2014-2018 మధ్యకాలంలో తొలుత పరిశ్రమల ఏర్పాటుకు కొంత ఊపు కనిపించినా గత ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకపోవడంతో పెట్టుబడులేవీ రాలేదని చంద్రబాబు ప్రభుత్వం చెబుతోంది. 2024-2029 మధ్య కాలంలో అమరావతితో సమాంతరంగా వికె పిసిపిఐఆర్ ప్రాంతంలో పెట్టుబడులను సుమారు రూ.43 వేల కోట్ల మేర ఆకర్షించాలనే ప్లాన్‌తో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. కాకినాడ-గంగవరం పోర్టుల్లో ఎల్‌ఎన్‌జి టర్మినల్స్, ఎస్‌ఇజడ్‌లలో యుటిలిటీ సెంటర్‌లు సహా కీలకమైన అంశాల్లో మౌలిక సదుపాయాలేవీ కార్యరూపం దాల్చలేదు. ఈ పనులన్నిటినీ జాప్యం జరగకుండా చేపట్టేందుకు ఎల్‌ఇఎ (లీ) అనే అంతర్జాతీయ సంస్థతో చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందాన్ని కుదుర్చుకుని విఎంఆర్‌డిఎ సమన్వయంతో వికె పిసిపిఐఆర్ ప్రాంతంలో ఇబ్బందులను తెలుసుకుని, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి అవసరమైన చోట్ల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు విఎంఆర్‌డిఎలోని పిసిపిఐఆర్ విభాగాన్ని సిద్ధం చేస్తోంది.

ఎలా? ఏమిటి? ఎక్కడెక్కడ?

రాష్ట్రంలోని కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో పిసిపిఐఆర్ పరిధిని ప్రభుత్వం గతంలోనే నిర్దేశించింది. తొలుత 600 చదరపు కిలోమీటర్ల పరిధి ఉండగా క్రమంగా ఇప్పుడు కొత్త గ్రామాలను చేర్చడంతో పరిధి 640 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. విశాఖ జిల్లాలోని గంగవరం పోర్టు దగ్గరగల కూరాడ గ్రామం మొదలుకొని కాకినాడలోని వాకలపూడి వరకూ పది రెవెన్యూ మండలాలు, 97 గ్రామాలు పిసిపిఐఆర్‌లోకి వస్తాయి. ఈ పరిధిలో ఏ అభివృద్ధి జరిగినా, ఫ్యాక్టరీ వచ్చినా, ఏ సంస్థయినా కంపెనీ స్థాపించాలన్నా, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు, లే అవుట్లకు సంబంధించిన పనులు ఉన్నా విఎంఆర్‌డిఎలోని పిసిపిఐఆర్ విభాగం అనుమతులు ఇవ్వనుంది. దీన్ని వేగవంతం చేసే దిశగా 'లీ' అనే సౌత్ ఆసియా సంస్థతో ఒప్పందం చేసుకొని 2025 మార్చి నుంచి ఎనిమిది నెలల వ్యవధిలో పలు సమావేశాలు నిర్వహించి ఈ రీజియన్‌లో పరిశ్రమల స్థాపన వ్యవహారాలు చక్కబెట్టేందుకు సిద్ధమవుతున్నారు. 2051 సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు, ఈ ప్లాన్ అప్ టు డేట్‌గా ఉండేందుకు లీ అసోసియేషన్‌తో రూ.1.75 కోట్లకు ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దేశంలో ఆరు పిసిపిఐఆర్‌లు ఇప్పటికే ఉన్నాయి. విశాఖపట్నంతో కలిపితే ఏడు అవుతాయి. గతంలో వికె పిసిపిఐఆర్ ఎస్‌డిఎ (స్పెషల్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఉండగా తాజాగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీగా మార్పు చేశారు. పేరు ఏదైనా పెట్రో కెమికల్ ఇండస్ట్రీస్ స్థాపన అంశాలనే ఇది చక్కబెడుతోందని విఎంఆర్‌డిఎ అధికారులు 'ప్రజాశక్తి'కి తెలిపారు. గడిచిన 18 ఏళ్లలో ఎలాంటి కదలికా లేనందున 2014 నుంచి 2025 వరకూ చాలా మార్పులు, పరిణామాలు జరిగి ఉంటాయన్న కారణంతో మాస్టర్ ప్లాన్ తయారీకి ఎనిమిది నెలలు వ్యవధి ఇచ్చినట్లు సమాచారం.

ప్రజలను సంప్రదిస్తాం

గ్రామాల్లో ప్రణాళికబద్ధ అభివృద్ధి నిమిత్తం మాస్టర్ ప్లాన్, పర్‌స్పెక్టివ్ ప్లాన్‌పై లీ అసోసియేట్స్ సంస్థతో దఫదఫాలుగా చర్చలు జరిపాం. ప్రణాళికలు రూపొందిస్తున్నాం. తుది మాస్టర్ ప్లాన్ ఆమోదానికి ఆయా గ్రామాల్లో ప్రజలను సంప్రదిస్తాం. ప్రజాభిప్రాయ సేకరణలు చేపడతాం.


-కెఎస్.విశ్వనాథన్, విఎంఆర్‌డిఎ కమిషనర్

'విజన్'కోసం కమిటీలు

- జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు
- అమలు బాధ్యత సచివాలయ కార్యదర్శులకు
- ప్రణాళిక శాఖ ఉత్తర్వులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి


స్వర్ణాంధ్ర విజన్ -2047 అమలు కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయిలో విజన్ అమలు బాధ్యత విజన్ అమలు బాధ్యత ఆ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రికి అప్పగించారు. సభ్యులుగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు, ఎమ్మెల్యే, ఎంపిలు, జెడ్పీ చైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ఉంటారు, ఉపాధ్యక్షునిగా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా సిపిఓ వ్యవహరిస్తారు. నియోజకవర్గాల యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ ప్రధాన కేంద్రంలోని ఎంపిడివో కన్వీనర్‌గా ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్, ఆర్డీవో, ఇతర మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. సచివాలయాల కమిటీల్లో వాటి స్థాయిని



బట్టి స్థానిక సర్పంచు, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదే సమయంలో క్షేత్రస్థాయిలో విజన్ అమలు బాధ్యతలను గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు అప్పగించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వారిలో కొంతమందిని ఈ విధానం అమలుకోసం ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున 875 మందిని ఎంపికచేయనున్నారు. స్టాటస్టిక్స్, గణాంక, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎంబిఏ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ఙ, రాజకీయ శాస్త్రం, వ్యవసాయం, ఇంజనీరింగ్ అంశాల్లో డిగ్రీ అర్హత కలిగిన వారు నియోజకవర్గాల్లో పనిచేసేందుకు అర్హులుగా నిర్ణయించారు. అలాగే జిల్లాకు ఐదుగురు చొప్పున 130 మందిని జిల్లా స్థాయి విజన్ అమలుకు వినియోగించుకోనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో శాఖకు ఇద్దరు చొప్పున 70 మందిని, ప్రణాళిక శాఖల్లో మరో 25 మంది కార్యదర్శులను ఎంపిక చేసి వినియోగించుకోవాలని నిర్ణయించారు.

ఆన్ డ్యూటీ కింద

ఎంపిక చేసిన కార్యదర్శులు ఆన్ డ్యూటీ కింద తమకు అప్పగించిన ప్రాంతాల్లో, శాఖల్లో పనిచేయాల్సి ఉంటుంది. ముందుగా ఏడాదిపాటు వారిని ఓడి విధానంలో కొనసాగిస్తారు. అలాగే నాలుగు విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులనే విజన్‌కు వినియోగించుకోవాలని నిర్ణయించారు. మహిళ పోలీస్, సర్వే అసిస్టెంట్, రెవెన్యూ కార్యదర్శి, ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులను విజన్‌కు వాడుకోవాలని నిర్ణయించారు.వీరి ఎంపిక బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. ఈ మేరకు ఏర్పాటు చేసే కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.



బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

- యుఎఫ్‌బియు వెల్లడి

3

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన

'ఉక్కు' రక్షణకు క్యాంపెయిన్

2

న్యాయమూర్తి నివాసంలో

నోట్ల కట్టలు

- ఢిల్లీ హైకోర్టు జడ్జి ఇంట్లో అగ్ని ప్రమాదంతో బయటపడిన నగదు
- సుప్రీంకోర్టు ఆంతరంగిక విచారణ
- కఠిన చర్యలకు కొలీజియం సిఫారసు

న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో లెక్క చూపని సొమ్ము పెద్ద మొత్తంలో లభించడంతో ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు శుక్రవారం ఆంతరంగిక విచారణ చేపట్టింది. యశ్వంత్ వర్మ నివాసంలో దొరికిన సొమ్ముకు సంబంధించి నివేదిక అందజేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయను ఆదేశించింది. యశ్వంత్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరగడంతో మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. అక్కడ వారికి భారీగా నగదు లభించింది. తాజా పరిణామం నేపథ్యంలో జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపాలని ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది.

సమావేశమైన ఫుల్ కోర్టు

సుప్రీంకోర్టుకు చెందిన న్యాయమూర్తులందరూ శుక్రవారం ఉదయం సమావేశమయ్యారు. దీనినే న్యాయ పరిభాషలో ఫుల్ కోర్ట్ అంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఎక్కువమంది న్యాయమూర్తులతో ఏర్పడిన ధర్మాసనం. యశ్వంత్ వర్మను బదిలీ చేస్తే సరిపోదని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫుల్ కోర్ట్ సూచించింది. ముందుగా యశ్వంత్‌ను బదిలీ చేసి, ఆ తర్వాత ఆంతరంగిక విచారణ జరపాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. జస్టిస్ వర్మ నివాసంలో నగదును స్వాధీనం చేసుకుంటున్న దృశ్యాల వీడియోను అధికారులు ప్రధాన న్యాయమూర్తికి అందజేశారు. ఆయన దానిని చూసి, కొలీజియంలోని ఇతర సభ్యులకు వివరాలు తెలియజేశారు. జడ్జి నివాసంలో ఎంత డబ్బు ఉన్నదీ తెలియరాలేదు. ఈ నెల 14వ తేదీ రాత్రి 11.30 గంటలకు వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. ఆ సమయంలో మిగతా 7లో

పోసానికి షరతులతో బెయిల్

ప్రజాశక్తి- గుంటూరు లీగల్

సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు, వారి ఫొటోలు మార్ఫింగ్ చేశారనే కేసులో గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న సినీనటుడు పోసాని కృష్ణమురళికి షరతులతో బెయిలు మంజూరైంది. గుంటూరు 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (ఇన్‌ఛార్జి ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి) బెయిల్‌ను మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. రూ.లక్ష వ్యక్తిగత పూచీకత్తుతో ఇద్దరు ష్యూరిటీలు ఇవ్వాలని, కోర్టు అనుమతి లేకుండా దేశం వదిలి వెళ్లరాదని బెయిల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రతి మంగళ, గురువారాల్లో మంగళగిరి సిఐడి పోలీస్ స్టేషన్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల మధ్య హాజరవ్వాలని నిబంధన విధించారు. కేసు విచారణ పూర్తయ్యేంత వరకు ఈ విషయాలను ఎక్కడా బహిరంగ ప్రకటనలు లేదా సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులుగానీ, ప్రెస్‌మీట్‌లోగానీ పెట్టరాదని పేర్కొన్నారు. సాక్షులను, ఇతర ముద్దాయిలను పోసాని కలవరాదని, విచారణకు సహకరిస్తూ అవసరమైనప్పుడు కోర్టుకు హాజరవ్వాలని బెయిల్ ఉత్తర్వుల్లో షరుతులు విధించారు.

ప్రమోషన్లు ఇవ్వరా?

- తీర్పు చెప్పి ఐదేళ్లు దాటినా ఎందుకు అమలు చేయలేదు?
- 3 నెలల్లో అమలు చేయకుంటే విచారణకు సిఎస్ రావాలి
- హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

వివిధ శాఖల్లోని ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించే అంశంపై 2018లో తీర్పు వెలువరిస్తే ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం సాచివేత ధోరణిని అమలు చేయడాన్ని తప్పుపట్టింది. మూడు మాసాల్లో ఉద్యోగోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని, లేని పక్షంలో జూన్ 23న జరిగే విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కె మన్మథరావుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఉద్యోగోన్నతులు లేకపోవడంతో తీవ్ర అన్యాయం జరుగుతోందంటూ పలువురు ఉద్యోగులు వేసిన వ్యాజ్యాలను హైకోర్టు విచారించింది. అన్నీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం ఉందో లేదో తేల్చకుండానే ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్లను అమలు చేయడాన్ని ఆక్షేపించింది. రిజర్వ్ కేటగిరి ఉద్యోగులు నిర్దేశిత పరిమితికి మించి ఉద్యోగోన్నతులు పొందనట్లయితే,



రిజర్వేషన్ పరిధిలోకి రాని ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఐదేళ్ల క్రితం ఇచ్చిన తీర్పును ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించింది. రిజర్వ్ కేటగిరి ఉద్యోగుల్లో ఎంతమంది గత ఆరేళ్లుగా ఉద్యోగోన్నతి పొందారని నిలదీసింది. తమ ఉత్తర్వులను అమలు చేయకపోతే తదుపరి విచారణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది.

జనాభా లెక్కలు

ఎందుకు దాటవేస్తున్నారు?

- రాజ్యసభలో నిలదీసిన ప్రతిపక్షాలు
- ఇప్పుడున్న 24 శాతం ప్రాతినిధ్యం దక్షిణాదికి తగ్గదంటారా? : జాన్ బ్రిట్టాస్
- సమాధానాలు లేక ఎదురుదాడికి దిగిన అమిత్‌షా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జనాభా లెక్కలు నిర్వహించకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు దాటవేస్తోందని ప్రతిపక్షాలు నిలదీశాయి. జనాభా లెక్కలు కూడా నిర్వహించలేని ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశాయి. జనాభా లెక్కలు దేశ ప్రజల స్థితిగతులకు ఒక ప్రామాణికమైన డేటా అని పేర్కొన్నారు. అలాంటి డేటాను నిర్వహించడంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రాజ్యసభలో



రాజ్యసభలో మాట్లాడుతున్న జాన్ బ్రిట్టాస్

హోంమంత్రిత్వ శాఖ పనితీరుపై శుక్రవారం చర్చ సందర్భంగా జనాభా లెక్కలు లేకపోవడంపై వివిధ పార్టీల ఎంపిలు ఆందోళన వ్యక్తం చేశారు. 'జనాభా లెక్కింపు అన్ని డేటాలకు తల్లి' అని ప్రతిపక్ష ఎంపిలు అన్నారు. 'సమాజంలోని అనేక బలహీన వర్గాలు తమ ప్రయోజనాల కోసం జనాభా లెక్కలపై ఆధారపడతాయి' అని పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజనపై సమాధానం ఇవ్వని హోంమంత్రి

నియోజకవర్గాల పునర్విభజన అమలు చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రస్తుత దామాషా ప్రాతినిధ్యంలో 24 శాతం కంటే తగ్గదని హామీ ఇస్తారా? అనే ప్రశ్నకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇవ్వలేదు. రాజ్యసభలో చర్చ సందర్భంగా ఎంపి జాన్ బ్రిట్టాస్ ఈ ప్రశ్నను లేవనెత్తారు. 'నియోజకవర్గాన్ని తిరిగి విభజించినా, దక్షిణ భారతదేశం ఒక్కసీటు కూడా కోల్పోదని మీరు చెప్పారు. డీలిమిటేషన్ తరువాత, దక్షిణ భారతదేశానికి ప్రస్తుతం ఉన్న 24 శాతం ప్రాతినిధ్యంలో ఎటువంటి తగ్గింపు ఉండదని మీరు హామీ ఇవ్వగలరా?' అని జాన్ బ్రిట్టాస్ ప్రశ్నించారు. రెండు గంటలపాటు జరిగిన సమాధాన ప్రసంగంలో బ్రిట్టాస్ లేవనెత్తిన అనేక ప్రశ్నలకు అమిత్ షా సమాధానం ఇవ్వలేదు.

మూడు సూత్రాలపై దేశ ఐక్యత : సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

ప్రజాస్వామ్య, సమాఖ్యవాదం, లౌకికవాదం వంటి మూడు సూత్రాలపై దేశ ఐక్యత ఆధారపడి ఉంటుందని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ అన్నారు. చర్చలో సిపిఎం తరపున ఆయన మాట్లాడారు. దేశానికి చాలా బెదిరింపులు ఉన్నాయని, మిగతా 7లో



శ్రీశైలం ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు

శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌జామ్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

శ్రీశైలం ఘాట్ రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దోర్నాల నుంచి శ్రీశైలానికి ఇసుక లోడుతో వెళ్తున్న లారీ చింతల లాస్ట్‌ఘాట్ రోడ్డు ఎక్కేసమయంలో తుమ్మలబయలుకు సమీపంలో డీజిల్ అయిపోంది. దీంతో లారీ రహదారిపైనే ఆగిపోయింది. రహదారికి ఇరువైపులా ఐదు కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. నాలుగు గంటల అనంతరం పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

వర్గీకరణపై చంద్రబాబు మోసం

- మాజీ మంత్రి ఆదిమూలపు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎస్‌సి వర్గీకరణపై చంద్రబాబు మరోసారి మోసపూరిత రాజకీయం చేశారని, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల చివరిరోజు హడావుడిగా స్టేట్‌మెంట్ ఇప్పించారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు అన్ని రోజులు జరిగినా ఆర్డినెన్స్ ఎందుకు తీసుకురావాలనుకున్నారని ప్రశ్నించారు. ఆర్డినెన్స్‌తో సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకదని, రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికను పబ్లిక్ డొమైన్లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఇంకా చిచ్చును రాజేసి అందులో చలికాచుకోవాలని అనుకుంటున్నారని, ఇంకా వివాదం చేసే దిశగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం సమస్యను వివాదం చేయడం తగదని పేర్కొన్నారు. దళిత సమాజాన్ని అయోమయంలో పెట్టి రాజకీయంగా ప్రయోజనాలు పొందేందుకు నాటకాలు ఆడుతున్నారనే అనుమానాలు ఉన్నాయని తెలిపారు. చట్టం చేయాలంటే అనుసరించాల్సిన విధివిధానాలు సిఎం చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. బిల్లును తయారుచేసి అసెంబ్లీలో ఆమోదించి గవర్నర్‌కు పంపాలని, ఇక్కడ అలాంటిదేమీ జరగలేదని వివరించారు. రాజీవ్ రంజన్ మిశ్రా రిపోర్టును మార్చి 10న కేబినెట్లో చర్చించారని, పబ్లిక్ డొమైన్లో ఎందుకు పెట్టలేదో చెప్పాలని అన్నారు. రోస్టర్ విధానం పూర్తి అయోమయంగా ఉందని చెప్పారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని 2026 జనాభా లెక్కల తరువాత జిల్లాల వారీ చేస్తామంటున్నారని, అంటే మరలా మంటలు రేపడం తప్ప మరొకటి లేదని అన్నారు. వర్గీకరణను డోలాయమానంలో పెట్టాలనే ఆలోచన తప్ప మరొకటి కనిపించడం లేదని పేర్కొన్నారు. దీన్ని పరిష్కారం లేని సమస్యగా మార్చొద్దని కోరారు.

ఆపరేషన్ గరుడ

- ఏకకాలంలో 100 బృందాలతో తనిఖీలు
- ఈగల్ ఐజి రవికృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈగల్ టీమ్ ఐజి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, స్థానిక పోలీసులు, డ్రగ్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'ఆపరేషన్ గరుడ' పేరుతో 100 బృందాలతో శుక్రవారం మెడికల్ షాపులు, మెడికల్ ఏజెన్సీలపై ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు ఈగల్ (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) ఐజి రవికృష్ణ తెలిపారు. సిఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో ఈ దాడులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ గరుడలో భాగంగా విజయవాడ గుణదలలోని పలు షాపుల్లో ఆకస్మిక దాడులు చేశామన్నారు. మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదని, అటువంటి వాటిని పరిశీలించామన్నారు. ఆల్‌బెండజోల్ వంటి కొన్ని మత్తు ఇచ్చే ట్యాబ్లెట్స్, ఇంజక్షన్స్‌ను కొనుగోలు చేసి యువతను బానిసలుగా మారుస్తున్నారన్నారు. గంజాయిని కట్టడి చేస్తున్న నేపథ్యంలో యువత ఈ విధమైన నిబంధనలకు విరుద్ధంగా మందులను కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. యువత ఇలాంటి మత్తు ట్యాబ్లెట్లకు బానిసలు కాకుండా ఉండాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ డైరెక్టర్ ఎంబిఆర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపైనా, మందులకు సరిగ్గా బిల్లులు ఇవ్వని వారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు.

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి ఆధ్వర్యాన

'ఉక్కు' రక్షణకు ప్రచారోద్యమం

ప్రజాశక్తి - విశాఖపట్నం

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలంటూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఏసి ఆధ్వర్యాన తలపెట్టిన క్యాంపెయిన్ శుక్రవారం ప్రారంభమైంది. అందులో భాగంగా విశాఖ పోర్టు ఏరియా విడిఆర్, జిఆర్‌ఎస్ గొడౌన్ల వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్, పర్మినెంట్ కార్మికుల తొలగింపులను ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి.. పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని అదే కేబినెట్ ద్వారా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీని ప్లాంట్ అభివృద్ధికి, ఉత్పత్తికి, ముడి సరుకుకు, యంత్రాలకు, కార్మికుల జీతభత్యాలకు వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సంస్థ ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తూ.. కీలక విభాగాల్లో దశాబ్దాలుగా పని చేస్తున్న వేలాది మంది కాంట్రాక్ట్ కార్మికులను అర్థాంతరంగా తొలగించడం అమానుషమన్నారు. ప్లాంట్ ఏర్పాటు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు తక్షణమే శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించాలని, 5212 ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, కార్మిక నేతలకు ఇచ్చిన అక్రమ షోకాజ్ నోటీసులను తక్షణమే రద్దు చేయాలని, బెదిరింపులు ఆపాలని, ఉక్కు ప్రయివేటీకరణ కుట్రలను రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం నిలువరించాలని కోరారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి, విశాఖపట్నం పోర్టు గొడౌన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.పైడిరాజు మాట్లాడుతూ ఉక్కు కార్మికుల పోరాటానికి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పోర్టు గొడౌన్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, నాయకులు పి.వెంకటరమణ, నాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతూ ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న జగ్గునాయుడు



మీడియాతో మాట్లాడుతున్న శ్రీదేవి

ఎస్‌సిలకు స్వయం ఉపాధి పథకాలు

- మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎస్‌సిల అభివృద్ధికి స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నట్టు రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. గుంటూరులోని ఎస్‌సి కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో శ్రీదేవి మాట్లాడారు. ఈ ఏడాది రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు కేటాయించారని తెలిపారు. ఎస్‌సిలకు ఉన్న 27 సంక్షేమ కార్యక్రమాలను గత ప్రభుత్వం పక్కన పెట్టిందని, కార్పొరేషన్ నిధులను ఇతర సంక్షేమ పథకాలకు మళ్లించిందని విమర్శించారు. ఎస్‌సి వర్గీకరణకు టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గతంలో ఉన్న పథకాలను తిరిగి పునరుద్ధరించేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు.

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో

వారం రోజులపాటు కార్యక్రమాలు

- మహనీయుల వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువతకు స్ఫూర్తిగా నిలిచిన, పోరాట యోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ స్ఫూర్తితో వారం రోజులపాటు యువ చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డివైఎఫ్ఐ వెల్లడించింది. వీరి 94వ వర్ధంతి ఈ నెల 23న నిర్వహించనున్నామని, ఈ సందర్భంగా 22 నుంచి డివైఎఫ్ఐ ఆధ్వర్యాన డ్రగ్స్, అవినీతి, నిరుద్యోగం వంటి అంశాలపై పలు కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 'డ్రగ్స్‌కు పాతర-డివైఎఫ్ఐ బాటరా', 'అవినీతిపై యుద్ధం- డివైఎఫ్ఐ సిద్ధం', 'నిరుద్యోగంపై సమరం-డివైఎఫ్ఐ నినాదం'తో... సేవ, శ్రమదాన, రక్తదాన శిబిరాలు, కాగడాల ర్యాలీలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సభలు, సదస్సులు, వైద్య శిబిరాలు వంటి కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామని, యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా నేటికీ సమాజంలో అసమానతలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్నికలకు ముందు యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, లేకుంటే ప్రతినెలా నిరుద్యోగ భృతిని ఇస్తామన్న పాలకులు బడ్జెట్‌లో ఆ అంశాన్నే ప్రస్తావించలేదన్నారు. దేశంలో అభివృద్ధి కొద్ది మందికి మాత్రమే అందుబాటులో ఉందని, కోట్లాది మంది కొనుగోలు శక్తి లేక తీవ్రంగా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిచనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో యువత, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ పేరుతో డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలలో జాప్యాన్ని నివారించాలని కోరుతూ పోరాటం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ, ఉపాధ్యక్షులు షేక్ నిజాముద్దీన్, నోహిత్ కృష్ణ, బసవ, డిఎస్‌సి సాధన కమిటీ నాయకులు రఘు, రామకృష్ణ, పోలీస్ కానిస్టేబుల్ జెఎసి నాయకులు నాగార్జున శంకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు లేవు

- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం
- ప్రజా చైతన్య యాత్రలో ఉపాధి కార్మికులు



ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలు శుక్రవారం పలు జిల్లాల్లో శనివారం కొనసాగాయి. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, ఇంటి పన్ను, తదితర సమస్యల గురించి స్థానిక ప్రజలు సిపిఎం నేతల ఎదుట ఏకరువు పెట్టారు. ఉపాధి హామీ పనులు చేపట్టలేదని, దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధి కార్మికులు వాపోయారు. గిరిజన ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయడంలేదని పలువురు గిరిజనులు సిపిఎం నేతల దృష్టికి తెచ్చారు.

విశాఖ జివిఎంసి పదో వార్డు పరిధిని తోటగరువు, బిఎస్‌ఆర్.నగర్‌లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. తాగునీరు, యుజిడి, కొండచరియలతో పొంచి ఉన్న ప్రమాదం, తదితర సమస్యలను స్థానికులు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలోని మడుతూరు, వెదురువాడ, గొర్లి ధర్మవరం గ్రామాలలో నాయకులు పర్యటించగా.. తమ ప్రాంతాల్లో నేటి వరకు ఉపాధి హామీ పనులు చేపట్టలేదని ఉపాధి కార్మికులు మొరపెట్టుకున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం అడుగులపుట్టు, లక్ష్మీపేటల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అడుగులపుట్టు సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. ముంచింగిపుట్టు మండలంలోని కరిముఖిపుట్, అరకులోయ మండలం మాడగడ పంచాయతీ నందిగుడలో ప్రజా చైతన్య యాత్రలు సాగాయి. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలంలోని పెద్దమడి తదితర గ్రామాల్లో గిరిజన ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయడంలేదని పలువురు గిరిజనులు సిపిఎం నాయకుల దృష్టికి తెచ్చారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, ముసునూరు, చింతలపూడి తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు నిర్వహించారు. ప్రజా చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా తహశీల్దార్లకు వినతి పత్రాలు అందించారు. గుంటూరు జిలా తాడేపల్లిలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు.



చెరుకు రైతుల ధర్నాలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

చెరుకు రైతుల సమస్యలపై మహాధర్నా

ప్రజాశక్తి - చోడవరం (అనకాపల్లి)

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరుకు రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని, క్రషింగ్ సజావుగా జరిగేందుకు యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా చోడవరం సుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చెరుకు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ.. త్వరితగతిన సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రెండు నెలలకుపైగా బకాయిలు చెల్లించకపోవడం, క్రషింగ్ సరిగా జరగక చెరుకు నిలువునా ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటపై విరక్తి చెంది తగులబెట్టుకునే పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావడం సిగ్గుచేటన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ల్లో సుమారు 450 చెరుకు కర్మాగారాలు నిర్విరామంగా నడుస్తున్నాయని, అక్కడ రైతులకు టన్ను చెరుకుకు రూ.4 వేల నుండి రూ.5 వేలకు చెల్లిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మాత్రం 32 కర్మాగారాలకుగాను ఐదు మాత్రమే నడుస్తున్నాయన్నారు. గిట్టుబాటు ధర రూ.5000 చెల్లిస్తే తప్ప రైతులు బతికే స్థితి లేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కర్రి అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, రైతు సంఘం, సిఐటియు నాయకులు వివి.శ్రీనివాసరావు, జి.వరలక్ష్మి, నాయుడు, సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, రైతు కూలీ సంఘం కన్వీనర్ కె.మోహన్ పాల్గొన్నారు. ఫ్యాక్టరీ సమీపంలోని రోడ్డుపై రైతుల రాస్తారోకోకు దిగారు. పోలీసులు వారిని పక్కకు నెట్టేసేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది.

రైతుల ఐక్యతతో పోలీసులు వెనక్కు తగ్గకతప్పలేదు. సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డిని కలవడానికి నాయకులు ఫ్యాక్టరీలోకి వెళ్తున్న సమయంలో పోలీసులు అడ్డగించారు. దీంతో ఆగ్రహించిన రైతులు మరోమారు రోడ్డుపైకి చేరి ఆందోళనకు సిద్ధమయ్యేసరికి సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డి సన్యాసినాయుడు కిందకు వచ్చారు. ఆయనకు నాయకులు వినతిపత్రం అందజేశారు. మహాధర్నాలో పాల్గొన్న సిపిఐ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, చెరుకు రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణను పోలీసులు అరెస్టు చేసి కాసేపు తరువాత విడిచిపెట్టారు.

కేంద్రం తీరు రాజ్యాంగ విరుద్ధం

- ఎఐసిసి సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కేంద్రం తీరు రాజ్యాంగ విరుద్ధమని ఎఐసిసి సంయుక్త కార్యదర్శి పాలక్ వర్మ తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నట్లు చెప్పారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు. ఈ క్రమంలోనే రాజ్యాంగ పరిరక్షణకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. భాష విషయంలో ప్రజలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన టిడిపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో కేంద్రంపై ఒత్తిడి తేకపోవడాన్ని తప్పుబట్టారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ పథకాలను సూపర్ ఫ్లాప్ పథకాలుగా మార్చిందన్నారు. అనేక పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా ఈ హామీలు ఇచ్చారా అని ప్రశ్నించారు. అధికారం కోసం హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని చెప్పారు. పిసిసి నాయకులు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ మాట్లాడుతూ.. దేశంలో 21 అధికార భాషలు ఉన్నాయని, తమిళ ప్రజలపై హిందీని బలవంతంగా రుద్దడం సరైంది కాదన్నారు. స్టీల్ ప్లాంట్, పోలవరం విషయంలో కేంద్రం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ వర్సిటీ భూములు కబ్జా

- నిందితులను శిక్షించాలని విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీ భూములను కబ్జా చేసిన వారిని వెంటనే శిక్షించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీలో విద్యార్థి సంఘాల నాయకులు, వర్సిటీ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు రామకృష్ణ, నాగరాజు, శరత్, నాగార్జున, యూనివర్సిటీ ఉద్యోగులు సుంకన్న, నాగరాజు, వెంకటస్వామి, మాధవశేఖర్ మాట్లాడారు. రాయలసీమ యూనివర్సిటీకి 1992లో రాష్ట్ర ప్రభుత్వం దాదాపుగా 262 ఎకరాలు కేటాయించిందని, గత పదేళ్లుగా యూనివర్సిటీ అధికారుల అలసత్వం, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ప్రస్తుతం 110 ఎకరాలు మాత్రమే మిగిలిందని చెప్పారు.

యూనివర్సిటీ స్థలం అయిన పసుపుల రోడ్డులో ఉన్న సర్వే నెం:9/3-1లో గల 1.50 ఎకరాల భూమిని అప్పటి యూనివర్సిటీ అధికారుల అండతో కొంతమంది కబ్జాకోరులు సబ్ డివిజన్ చేసి వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని విమర్శించారు. అక్రమంగా హద్దులను వేసి యథేచ్ఛగా ప్లాట్లు వేసి నిర్మాణ పనులను చేపడుతున్నారని చెప్పారు. వర్సిటీకి సంబంధించిన భూములు ఉన్న సర్వే నంబర్‌కు ఎన్‌ఒసి ఇచ్చిన అప్పటి రిజిస్ట్రార్, విసిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వర్సిటీ భూములపై సర్వే నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. యూనివర్సిటీ భూములను కాపాడకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. అవసరం అయితే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అమరావతి జెఎసి ఛైర్మన్ బొప్పరాజు

పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

- ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన రూ.6500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ పొదుపు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

పెన్షనర్లకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల కాకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. రెవెన్యూ శాఖలో క్లస్టర్ విధానాన్ని తీసుకువస్తే అనేక సమస్యలు తలెత్తుతాయని, ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టి పని భారాన్ని తగ్గించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఛైర్మన్ కెవైకె. కృష్ణ, జిల్లా సెక్రటరీ జనరల్ వెంకట్ రాజు, ఎపి డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు, డ్రైవర్స్ అసోసియేషన్ ఆల్ ఇండియా ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, ఎపి రెవెన్యూ సంఘం రాష్ట్ర నాయకులు రజనీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగరాజు, ఇతర సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల స్థలాల భూమిలో జెండా పాతుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- కొమరగిరి భూముల్లో జెండాలు పాతిన నాయకులు

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

గత వైసిపి ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల కోసం సేకరించిన భూమిని కొంతమంది ఆక్రమించుకుని పంటలు పండిస్తున్నారని, పేదల కోసం సేకరించిన భూమిలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కొమరగిరి గ్రామంలో పేదల భూమిని ఆక్రమించుకున్న ప్రాంతంలో సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్ర జెండాలు పాతారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కొమరగిరి పంచాయతీ పరిధిలో 72 ఎకరాలను రూ.32 కోట్లు వెచ్చించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కొనుగోలు చేసిందన్నారు. అయితే, కొంతమంది ఇందులోని 42 ఎకరాల్లో యథావిధిగా పంటలు వేశారని తెలిపారు. పేదల కోసం సేకరించిన భూమిని వెంటనే వారికి అప్పగించాలని, ఒక్కొక్కరికి మూడు సెంట్లు భూమిని కేటాయించి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఈ విషయంలో సహకరించాలని కోరారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కొత్తపల్లి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రాలు అందించారు.

కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

- అధ్యక్షకార్యదర్శులు బి రామకృష్ణ, కె శ్రీనివాస్

ప్రజాశక్తి - పెదవేగి (ఏలూరు జిల్లా)



బి రామకృష్ణ



కె శ్రీనివాస్

ఏలూరు జిల్లా పెదవేగి మండలం విజయరాయిలో జరిగిన కోకో రైతుల రాష్ట్ర సదస్సులో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శిగా కె.శ్రీనివాస్, రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బోళ్ల సుబ్బారావు (పశ్చిమగోదావరి), పానుగంటి అచ్యుతరామయ్య (ఏలూరు), ఉప్పుగంటి భాస్కరరావు (కోనసీమ), గుదిబండి బండి వీరారెడ్డి (ఏలూరు), మార్ని శ్రీనివాసరావు (తూర్పుగోదావరి), సహాయ కార్యదర్శులుగా ఉప్పల కాశీ (తూర్పుగోదావరి), కొసరాజు రాధాకృష్ణ (ఏలూరు), కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ (కోనసీమ), కోశాధికారిగా జాస్తి కాశీబాబు (ఏలూరు), మరో 35 మంది నూతన కమిటీకి ఎన్నికయ్యారు.

విజయరాయిలోని సీతారామ కల్యాణ మండపంలో నూతన కమిటీ ఎన్నిక అనంతరం జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు బొల్లు రామకృష్ణ, కె శ్రీనివాస్ మాట్లాడుతూ అందరూ సంఘటితం కావడమే లక్ష్యంగా కోకో గింజల కొనుగోలు సమస్యను వెంటనే పరిష్కరించాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇచ్చి కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రభుత్వాలు తమ చర్యలు చేపట్టాలని కోరారు.

దీనిపై కోకో రైతుల సంఘం ప్రతినిధులతో రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ చర్చలు జరిపారని, అయినా గింజల కొనుగోలు సమస్య పరిష్కారం కాలేదన్నారు. కంపెనీలు తక్కువ ధరకు గింజలు కొనుగోలు చేయడం వల్ల కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కోకో రైతుల సదస్సులో సమస్యలపై తీర్మానాలు ఆమోదించి కార్యచరణ రూపొందించినట్లు తెలిపారు. కోకో సాగు చేస్తున్న జిల్లాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో జరుగుతున్న ధర్నాలు, రాస్తారోకో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

సాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకూడదు

- అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకూడదని రబీ సీజన్ మరికొన్ని రోజుల్లో ముగుస్తుండటంతో కాలువల ఆయకట్టు చివరి రైతులకూ సాగునీరు అందించేందుకు వాటర్ మేనేజ్‌మెంట్ చేసుకోవాలని అధికారులను జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. శుక్రవారం ఇఎన్‌సి వెంకటేశ్వరరావు, పలు జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కెసి కెనాల్ ఆయకట్టు, నాగార్జునసాగర్ కుడికాలువ, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఆయకట్టు పంటలకు పూర్తిస్థాయిలో నీరు అందించాలని ఆదేశించారు. నంద్యాల, పల్నాడు, ప్రకాశం, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లతో ఫోన్లో మాట్లాడారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయం చేసుకుంటూ వారాబందీ పగడ్బందీగా నిర్వహిస్తూ, ఆఖరి ఎకరం వరకూ సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. దీనిపై వెంటనే యాక్షన్‌ప్లాను ఉండాలని సూచించారు.

తిరుమల పవిత్రత దెబ్బతీయడం లేదు

- ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్ కౌంటర్

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల పవిత్రత దెబ్బతీసే విధంగా నిర్మాణాలు చేయడం లేదని హైకోర్టుకు ఒబరాయ్ గ్రూప్ తెలియజేసింది. ఫైవ్ స్టార్ హోటల్, విల్లాల నిర్మాణాలకు ఇచ్చిన భూమి తిరుమల దివ్య క్షేత్ర పరిధిలో లేదని చెప్పింది. కేటాయించిన భూమిలో చట్ట ప్రకారం అన్ని అనుమతులు తీసుకున్నాకే నిర్మాణాలు చేస్తున్నామని తెలిపింది. తిరుపతి రూరల్ మండలం, పేరూరు పంచాయతీ పరిధిలో ఫైవ్ స్టార్ హోటల్స్, విల్లాల నిర్మాణం నిమిత్తం 20 ఎకరాల భూమిని ఒబరాయ్ గ్రూపునకు చెందిన ముంతాజ్ హోటల్స్ లిమిటెడ్, ట్రైడెంట్ ఫైవ్ స్టార్ హోటల్స్‌కు వైఎస్ జగన్ సిఎంగా ఉండగా 2021లో రాష్ట్రం కేటాయింపులు చేసింది. దీనిని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు ఓంకార్, ఎపి సాధుపరిషత్ అధ్యక్షులు శ్రీనివాసనంద స్వామీజీ హైకోర్టులో సవాలు చేస్తూ పిల్ దాఖలు చేశారు. గతంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసిన మేరకు ఒబరాయ్ హోటల్స్ ప్రతినిధి రాజా రామన్ శంకర్ పైవిధంగా ఇటీవల కౌంటర్ దాఖలు చేశారు. 'దేశ విదేశాల నుంచి రోజూ శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమల వచ్చే వాళ్ల అవసరాలను తీర్చేందుకు వీలుగా నిర్మాణాలు చేసేందుకు ప్రభుత్వం భూమిని లీజు ప్రాతిపదికన ఇచ్చింది. తుడా, పిసిబి, అగ్నిమాపక శాఖల నుంచి పర్మిషన్లు తీసుకున్నాం. సెవన్ స్టార్ సౌకర్యాలతో హోటల్స్, విల్లాలను రాష్ట్రంలో ఐదుచోట్ల నిర్మిస్తున్నాం. అందులో తిరుపతి కూడా ఒకటి. నిర్మాణాలకు రూ.1,350 కోట్లను వెచ్చిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ భూ కేటాయింపులను రద్దు చేయాలని టిటిడి బోర్డు తీర్మానం చట్ట వ్యతిరేకమని ప్రకటించాలి' అని కౌంటర్‌లో కోరారు. పిల్‌పై హైకోర్టు జూన్ 18న విచారణ చేయనుంది.

నేరాల నియంత్రణలో టెక్నాలజీ కీలకం

- రౌడీ షీటర్ల కదలికలపై నిఘా
- హోంశాఖ సమీక్షలో మంత్రి అనిత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



నేరాల నియంత్రణలో టెక్నాలజీ చాలా కీలకమని, శాంతిభద్రతలను కాపాడే విషయంలో ఎవరూ రాజీపడొద్దని పోలీస్ ఉన్నతాధికారులను హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. చిన్నారులు, మహిళల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో శుక్రవారం డిజిపి హరీష్‌కుమార్ గుప్తాతో కలిసి శాంతిభద్రతలపై రాష్ట్ర స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకోసారి శాంతిభద్రతలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పటిష్ట భద్రతతో శాసనసభ సమావేశాల నిర్వహణకు కృషి చేసిన పోలీసులను ఆమె అభినందించారు. ఈ నెల 25, 26 తేదీల్లో సిఎం అధ్యక్షతన జరగనున్న జిల్లా కలెక్టర్ల సదస్సుకు కూడా సమర్ధవంతంగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. న్యాయపరమైన చిక్కుముడులున్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ పరమైన కేసులను మరింత వేగంగా పరిష్కరించేందుకు రెవెన్యూశాఖతో నిరంతరం పోలీస్‌శాఖ సమన్వయం చేసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రౌడీషీటర్లు, పాత రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. సిసిటివి కెమెరాల ఏర్పాటులో పురోగతిపై జిల్లాల ఎస్‌పిలతో మంత్రి మాట్లాడారు. కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో ఇప్పటికే సుమారు 24 వేల సిసి కెమెరాలు ఇన్‌స్టాల్ అయినట్లు కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ వివరించారు. జిల్లాల వారీ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా ఇచ్చిన లక్ష్యాలను చేరుకునే దిశగా కృషి చేస్తున్నటు ఎస్‌పిలు తెలిపారు. ఈ సందర్భంగా పబ్లిక్ న్యూసెన్స్ కేసులపైనా అనిత ఆరా తీశారు. ఈ సమీక్షలో డిజిపితో పాటు పలువురు డిఐజిలు, విజయవాడ, విశాఖపట్నం పోలీస్ కమిషనర్లు, అన్ని జిల్లాల ఎస్‌పిలు, డిజిపి కార్యాలయంలోని పోలీస్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సమీక్ష అనంతరం సరెండర్స్, ఎరియర్స్ ఇప్పించాలని రాష్ట్ర పోలీసుల సంఘం.. హోంమంత్రికి వినతిపత్రం అందజేశారు.

హోంమంత్రిని కలిసిన హిజ్రాలు

హోంమంత్రి వంగలపూడి అనితను డిజిపి కార్యాలయం వద్ద కొంతమంది హిజ్రాలు కలిశారు. ఇటీవల అనకాపల్లి హిజ్రా హత్య కేసులో ప్రభుత్వం, పోలీసుల స్పందన బాగుందని హోంమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఓ హిజ్రాకు సంబంధించిన పోస్టింగ్ గురించి వినతిపత్రం అందజేశారు. ఎన్‌జిఒ, వన్‌స్టాప్ సెంటర్లలో గతంలో ఉద్యోగాలుండేవని ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. చదువుకుని అన్ని అర్హతలను బట్టి గౌరవ ప్రదంగా ఉద్యోగం చేసి బతకాలునుకునే హిజ్రాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.



కర్నూలులోని సుందరయ్య సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు, రైతు సంఘం నేతలు

ఆందోళన శిబిరాలను ధ్వంసం చేయడం దుర్మార్గం

కర్నూలులో ఎపి రైతు సంఘం నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రైతుల ఆందోళనలపై కేంద్ర ప్రభుత్వ ధమనకాండకు నిరసనగా శుక్రవారం కర్నూలులోని కార్మిక కర్షక భవన్ నుండి సుందరయ్య జంక్షన్ వరకు రైతులు, రైతు సంఘం నేతలు ప్రదర్శనగా వెళ్లి నిరసన తెలిపారు. 'రైతు వ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలని, రైతుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ఢిల్లీ సరహద్దులో శాంతియుత ఆందోళనకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని' నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ.. ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతుల ఆందోళన శిబిరాలను ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. గతంలో ఏడాది పాటు ధర్నా చేసిన రైతులను వివిధ రూపాల్లో ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాలను వెనక్కు తీసుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

3 నెలల్లో భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం

- రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మూడు నెలల్లో భూ సంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూ (ల్యాండ్స్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పేర్కొన్నారు. విజయవాడ గవర్నర్‌పేట సిటీ సివిల్ కోర్టు సమీపంలోని ఫార్మర్స్ సెంటర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం రాష్ట్ర స్థాయి భూ వ్యవస్థాపన దిశా నిర్దేశక సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సిసిఎల్‌ఎ జయలక్ష్మి నోట్ స్పీకర్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ.. భూ వ్యవస్థాపనకు సంబంధించిన అన్ని రెవెన్యూ కార్యక్రమాలు జాయింట్ కలెక్టర్ల పర్యవేక్షణలో నేరుగా ఉంటాయన్నారు. డేటా ఎంట్రీలో కచ్చితత్వం కీలకమని, నిర్లక్ష్యంగా లేదా తప్పుగా సమాచారాన్ని నమోదు చేస్తే సహించేది లేదన్నారు. భూ వ్యవస్థాపనకు సంబంధించిన చట్టాలు ఇప్పటికే స్పష్టంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో అదనపు స్పష్టత అవసరం లేదన్నారు. భూ వ్యవస్థాపన సక్రమంగా జరిగేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఇందుకు డిజిటల్ పాలన సమర్ధవంతమైన విధానాలు, కచ్చితమైన భూ రికార్డులు కీలకమని సోడియా పేర్కొన్నారు. సిసిఎల్‌ఎ జయలక్ష్మి మాట్లాడుతూ.. భూ సంబంధిత ప్రక్రియలను సులభతరం చేయడం ముఖ్యంగా వెబ్‌ల్యాండ్, ఫ్రీ హోల్డ్ హౌస్ సైట్లు, హౌస్ సైట్లు కేటాయింపు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇందుకోసం ఇప్పటికే వేసిన లే అవుట్లలో అదనంగా ఖాళీ భూమి అందుబాటులో ఉంటే దానిని కొత్త హౌస్‌సైట్ల కేటాయింపునకు వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. అదనపు సిసిఎల్‌ఎ సెక్రటరీ ఎన్ ప్రభాకర్‌రెడ్డి రీ సర్వే భూ హక్కులు, ఆక్రమణలు, డిజిటల్ భూ వ్యవస్థాపన వ్యవస్థలు వంటి కీలక అంశాలపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

కౌలు రైతులను మోసగించిన ప్రభుత్వం

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం.. కౌలు రైతులను నమ్మించి మోసం చేసిందని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత కౌలు చట్టాన్ని రద్దు చేసి కౌలు రైతులకు మేలు, రక్షణ కల్పించే విధంగా కొత్త కౌలు చట్టం తీసుకొస్తామని ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రకటించిందని తెలిపారు. కొత్త చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ తమ సంఘం ఆధ్వర్యాన రెండు లక్షల సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలకు అందించామని వివరించారు. కొత్త చట్టాన్ని తీసుకొస్తామని బడ్జెట్ సమావేశాల్లో వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయంలో వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు ప్రకటించారని తెలిపారు. ప్రాంతీయ సమావేశాల్లో రైతుల అభిప్రాయాలను తీసుకుందని పేర్కొన్నారు. ముసాయిదా చట్టాన్ని తయారు చేసి కూడా అసెంబ్లీలో ప్రవేశపెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోయినా అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు కూడా అమలు చేస్తామని వెల్లడించారని తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసినా కౌలు రైతుల గోడు ప్రభుత్వానికి పట్టలేదని విమర్శించారు. వ్యవసాయ సీజన్ త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. శాసనసభ సమావేశాలు ఇప్పట్లో జరిగే అవకాశం లేదని, చట్టం తీసుకురావడం సాధ్యం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కనీసం ఆర్డినెన్స్ రూపంలో అయినా చట్టాన్ని తీసుకురావాలని కోరారు. అన్నదాత సుఖీభవ, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలను కౌలు రైతులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన కౌలు చట్టాన్ని పోరాడి సాధించుకునేందుకు కౌలు రైతులు సిద్ధంగా ఉండాలని కోరారు.

ఉద్యోగులకు రూ.30 వేల కోట్ల బకాయి

- రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలకోట్ల బకాయి ఉందని, వాటిని ఎప్పుడిస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులను మోసం చేసిందని అన్నారు. చంద్రబాబు పాలన అంటేనే ఉద్యోగ వ్యతిరేక పాలనని, ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఎప్పుడిస్తారో చెప్పాలని కోరారు. నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డిఎ, పిఆర్‌సి బకాయిలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సిపిఎస్ మొత్తం, జిపిఎస్, ఎపిజిఎల్‌ఐ చెల్లిస్తామని హామీనిచ్చారని, అడిగితే ఏమీ తెలియనట్లు ఉంటోందని తెలిపారు. సిపిఎస్, జిపిఎస్‌లను సమీక్షించి ఆమోదయోగ్యమైన పథకాన్ని తీసుకొస్తామన్నారని, ఇప్పటికీ ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, హెల్త్ సెక్రటరీలు రోడ్లమీదకు వచ్చి తమకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని తెలిపారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేశారని, సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఈతకెళ్లి ఇద్దరు బాలురు మృతి

ప్రజాశక్తి - ఆకివీడు (పశ్చిమగోదావరి)

కాలువలో ఈతకెళ్లి ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడిన సంఘటన పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం చినకాపవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చినకాపవరం గ్రామ పరిధిలోని దండగర్ర ప్రాంతానికి చెందిన కౌరు శరత్‌కుమార్ (10), కటారి పవన్ సాయి (10) శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగొచ్చారు. భోజనం అనంతరం కొంతమంది పిల్లలతో కలిసి పక్కనే ఉన్న వెంకయ్య వయ్యేరు కాలువలో ఈత కొట్టేందుకు దిగారు. ఈ క్రమంలో ఐదో తరగతి విద్యార్థులు శరత్‌కుమార్, కటారి పవన్ సాయి నీట మునిగి గల్లంతయ్యారు. పక్కనే ఉన్న చిన్నారులు వెంటనే స్థానికులకు సమాచారం అందించారు. వారు కాలువలో గాలించి ఇద్దరినీ ఒడ్డుకు చేర్చారు. అయితే, అప్పటికీ ఇద్దరూ మృతి చెందారు.

ప్లానింగ్ నిబంధనలు సరళతరం

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో ప్లానింగ్ నిబంధనలు సరళతరంగా ఉన్నాయని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ప్లానింగ్ తదితర అంశాలపై శుక్రవారం వేర్వేరు అసోసియేషన్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో టౌన్‌ప్లానింగ్ సంస్కరణలు అమలు చేస్తున్నామని వివరించారు. నాన్ హైరైజ్ భవనాల సెట్‌బ్యాక్స్ గురించి వివిధ నిర్మాణ అసోసియేషన్లు కొన్ని మినహాయింపులు కావాలని కోరారని, వాటిని సాధ్యం కాదని తేల్చిచెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. ఎక్కడ నిర్మాణం చేసినా ఆహ్లాదంగా ఉండాలని, పాత నగరాల్లో సర్క్యులర్ పాట్రన్ కొనసాగుతుందని వివరించారు. లైసెన్సు సర్వేయర్ల ఫీజు ఒక రూపాయి మాత్రమే పెట్టామని, దీనివల్ల యువతకు ఉపాధి సులువుగా దొరుకుతుందని వివరించారు.

4 నెలల్లో విశాఖ మాస్టర్‌ప్లాను సిద్ధం

విశాఖ అభివృద్ధికి సంబంధించి నాలుగు నెలల్లో మాస్టర్‌ప్లాను సిద్ధం చేస్తామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని దీని రూపకల్పన ఉంటుందని పేర్కొన్నారు. విశాఖపట్నం నగర అభివృద్ధితోపాటు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, రామకృష్ణబాబు గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్, కొణతాల రామకృష్ణ, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా తదితరులతో మంత్రి నారాయణ సమీక్షించారు. వైజాగ్‌లో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యలు, మెట్రోరైల్ ప్రాజెక్టు, భూముల ఆక్రమణ, తాగునీటి సమస్య, టిడిఆర్ బాండ్లు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ వంటి అంశాలను సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దీనిపై నారాయణ మాట్లాడుతూ.. గతంలో స్వార్థం కోసం విశాఖ మాస్టర్‌ప్లాను రూపొందించారని, దీన్ని మార్పులు చేసి ఆన్‌లైన్లో ఉంచుతామని తెలిపారు. ప్రజల నుండి అభిప్రాయాలు తీసుకుని నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని చెప్పారు. కొన్నిచోట్ల రోడ్లు వెడల్పు చేయాల్సి ఉందని, మెట్రోరైల్ కూడా మాస్టర్‌ప్లానులో భాగమేనని అన్నారు. టిడిఆర్ బాండ్లపైనా అన్ని మున్సిపాలిటీల్లోనూ స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని, త్వరలోనే పరిష్కారం అవుతాయని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని, దీంతో రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని చెప్పారు. నీటి సమస్య ఉందని, వాటన్నిటినీ పరిష్కరించేందుకు సిఎం ఆదేశాల మేరకు ముందుకు వెళతామని అన్నారు. సమీక్ష అనంతరం కొణతాల రామకృష్ణ మీడియాతో మాట్లాడారు. గతంలో ఇష్టానుసారంగా మాస్టర్‌ప్లాను మార్పులు చేశారని అన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకుని మళ్లీ రూపొందిస్తామని చెప్పారు. 22ఎ భూముల సమస్య కూడా ఉందని, నీటి సమస్య, బీచ్ కారిడార్, అనకాపల్లి, గాజువాకలో భూ సమస్యలు ఉన్నాయని, వాటన్నిటినీ పరిష్కరిస్తామని వివరించారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోడ్ల విస్తరణ సమయంలో చిన్న చిన్న స్థలాలు ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారని, వాటికి ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి నారాయణను కోరామని చెప్పారు. బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ.. 2047 మాదిరే చంద్రబాబు వైజాగ్‌పై దృష్టి పెట్టారని అన్నారు. వైజాగ్ మాస్టర్‌ప్లానులో లొసుగులు ఉన్నాయని, వాటిని సరిచేయాలని కోరినట్లు తెలిపారు.

హిందాల్కో రూ. 45,000 కోట్ల పెట్టుబడులు


ముంబయి : ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ప్రధానమైన లోహ వ్యాపార సంస్థ అయిన హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ తదుపరి తరం ఇంజనీరింగ్ ఉత్పత్తుల తయారీ కోసం రూ.45,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. అల్యూమినియం, రాగి, స్పెషాలిటీ అల్యూమినా వ్యాపారాలపై వ్యయాలు చేయనున్నట్లు పేర్కొంది. సంస్థ తదుపరి మార్పు కోసం కొత్త బ్రాండ్‌ను ఆవిష్కరించినట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా తెలిపారు. తమ సంస్థ ప్రస్తుతం 10 దేశాల్లో 52 ప్లాంట్లను కలిగి ఉందన్నారు.

హిందాల్కో కొత్త లోగో మార్పుకు ఉత్ప్రేరకంగా, సమస్య పరిష్కారిగా, పరిశ్రమలలో పురోగతికి శక్తినిచ్చే కొత్త పరిష్కారాల సృష్టికర్తగా ప్రతిబింబించనుందని హిందాల్కో ఇండస్ట్రీస్ ఎండి సతీష్ పాయ్ తెలిపారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా

- యుఎఫ్‌బియు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్



బ్యాంకింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఇచ్చిన సమ్మె పిలుపు తాత్కాలికంగా వాయిదా పడింది. శుక్రవారం సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో జరిగిన సమావేశం అనంతరం మార్చి 24, 25 తేదీలలో రెండు రోజుల దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను విరమించుకున్నట్లు యుఎఫ్‌బియు ప్రకటించింది. ప్రధానంగా ఐదు రోజుల పని దినాలు, కొత్త నియామకాలు, పనితీరు ఆధారంగా ప్రోత్సాహక ఆందోళన అంశాలపై లేబర్ కమిషనర్, ఫైనాన్సియల్ సర్వీసెస్ శాఖ (డిఎఫ్‌ఎస్) అధికారులతో చర్చించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అధికారులు తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించారని పేర్కొన్నాయి. "ఐదు రోజుల పని విధానంపై తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని సెంట్రల్ లేబర్ కమిషనర్ హామీ ఇచ్చారు. నూతన నియామకాలు, ఇతర ఆందోళనలపై తదుపరి చర్చలు జరుపుతామని ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ (ఐబిఎ) అంగీకరించింది. ఈ సానుకూల పరిణామాల దృష్ట్యా తాము సమ్మెను ఒకటి లేదా రెండు నెలలు వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాము." అని యుఎఫ్‌బియు తెలిపింది. తదుపరి దశ చర్చలు ఏప్రిల్ మూడో వారంలో ఉంటాయని వెల్లడించింది. యుఎఫ్‌బియు మార్చి 24, 25న సమ్మెకు పిలుపునిచ్చినప్పటికీ.. మార్చి 22, 23 కూడా సాధారణ సెలవులు కావడంతో నాలుగు రోజులు బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయేవి.

పని చేయని మొబైల్ నెంబర్లకు యుపిఐ సేవలు బంద్

న్యూఢిల్లీ : పని చేయని (ఇన్‌యాక్టివ్) లేదా వేరే వారికి కేటాయించిన మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యుపిఐ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ విషయమై బ్యాంకులు, పేమెంట్ సేవలందించే ప్రొవైడర్లకు తాజాగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) ఆదేశాలు జారీ చేసింది. అనధికారిక వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఆ నంబర్లను డీయాక్టివేట్ చేయాలని స్పష్టం చేసింది. ఎన్‌పిసిఐ ఆదేశాల మేరకు గూగుల్ పే, ఫోన్‌పే, పేటియం వంటి యాప్స్‌తో పాటు బ్యాంకులు ఇన్‌యాక్టివ్ నంబర్లను తొలగించనున్నాయి.

జిఇఐకి గ్రేట్ ప్లేస్ టు వర్క్ గుర్తింపు

హైదరాబాద్ : తమ సంస్థకు గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ గుర్తింపు లభించిందని జియుఎస్ ఎడ్యుకేషన్ ఇండియా (జిఇఐ) తెలిపింది. ఇది అధిక విశ్వాసం, అధిక పనితీరు సంస్కృతిని పెంపొందించడంలో తమ నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని ఆ సంస్థ ఎండి శశి జలిగమ తెలిపారు. విశ్వసనీయత, గౌరవం, న్యాయబద్ధత, స్నేహపూర్వకత ఆధారంగా తమకు ఈ గుర్తింపు లభించిందన్నారు.




భెల్‌కు రూ.7,500 కోట్ల ఆర్డర్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని విద్యుత్ తయారీ ఉత్పత్తుల కంపెనీ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు భారీ ఆర్డర్ దక్కింది. గుజరాత్‌లోని ఉకై సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి గాను రూ.7,500 కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఈ యూనిట్‌ను 54 నెలల్లో అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది.

తెలుగు రాష్ట్రాల్లో రూ.1,000 కోట్ల వ్యాపారం లక్ష్యం

- గోద్రేజ్ జెర్సీ సిఇఒ భుపేంద్ర సూరి



హైదరాబాద్ : వచ్చే రెండేళ్లలో తెలుగు రాష్ట్రాల్లో రూ.1,000 కోట్ల వ్యాపారం లక్ష్యంగా పెట్టుకున్నామని గోద్రేజ్ అగ్రోవెట్ లిమిటెడ్‌కు చెందిన గోద్రేజ్ జెర్సీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భూపేంద్ర సూరీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఇక్కడ పలు ఉత్పత్తులను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎపి, తెలంగాణలో రూ.650 ఆదాయాన్ని కలిగి ఉన్నామన్నారు. ఇక్కడి మార్కెట్‌లో విస్తరణకు 3ఎక్స్3 ఎత్తుగడలను అవలంభించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా బాదం మిల్క్, పనీర్, పెరుగు వాల్యూయేడెడ్ ఉత్పత్తులపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. రెండేళ్లలో బాదం మిల్క్ విభాగం నుంచి రూ.100 కోట్ల రెవెన్యూ అంచనా వేస్తున్నామన్నారు. తమ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, నాగ్‌పూర్, మహారాష్ట్రలో కార్యకలాపాలను కలిగి ఉండగా.. ఎనిమిది డైరీ ప్లాంట్లు సహా ఒంగోల్‌లో ఒక్క పాల పౌడర్ ప్లాంట్‌ను కలిగి ఉన్నామన్నారు. ఆంధ్ర, తెలంగాణలో వచ్చే 12 నెలల్లో మా పంపిణీ నెట్‌వర్క్‌ను 20,000 అవుట్‌లెట్‌లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని గోద్రేజ్ జెర్సీ మార్కెటింగ్ హెడ్ శంతను రాజ్ తెలిపారు.

హుదూద్ ఇళ్లకు విద్యుత్తు సదుపాయం

- ఫలించిన సిపిఎం పోరాటం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం పోరాటం ఫలితంగా విజయనగరం లంకాపట్నంలో హుదూద్ కాలనీల్లో అధికారులు విద్యుత్తు సదుపాయం కల్పించారు. 2014లో వచ్చిన హుదూద్ తుపాను ప్రభావంతో నష్టపోయిన ఇళ్ల స్థానంలో విజయనగరంలోని లంకాపట్నంలో హుదూద్ ఇళ్ల కాలనీ నిర్మించారు. ఇందులో 18 బ్లాక్‌ల్లో 432 ఇళ్లు ఉన్నాయి. వీరికి 2019లో హక్కు పత్రాలు పంపిణీ చేశారు. కానీ నేటికీ అక్కడ కనీస మౌలిక సౌకర్యాలు కల్పించలేదు. కరెంట్, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ 2020లో సిపిఎం పోరాటం చేయడంతో ట్యాంకర్ల ద్వారా కార్పొరేషన్ అధికారులు నీటిని సరఫరా చేశారు. కాని నేటికీ విద్యుత్తు సదుపాయం కల్పించలేదు. నాటి నుండి నేటి వరకూ మౌలిక వసతుల కోసం సిపిఎం సుదీర్ఘంగా పోరాడుతోంది. ఈ నెల 8న హుదూద్ ఇళ్ల వద్ద ప్రజా చైతన్య యాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. తక్షణమే విద్యుత్తు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 18న సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయాన్ని పేదలు ముట్టడించారు. ఫలితంగా ప్రభుత్వం స్పందించి విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తోంది. ఇళ్లకు విద్యుత్తు మీటర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. ఇది సిపిఎం, పేదల పోరాట ఫలితమని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అన్నారు. శుక్రవారం హుదూద్ కాలనీల్లో ట్రాన్స్‌ఫార్మర్లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి. రమణమ్మ, బి.రమణ. రంభ శ్రీనివాస్, బి.వెంకట రావు తోటయ్య తదితరులు పాల్గొన్నారు .



మంత్రి ఫరూక్‌కు సతీవియోగం

- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు సతీవియోగం కలిగింది. హైదరాబాద్‌లో ఉన్న మంత్రి ఫరూక్ సతీమణి షహనాజ్ (69) గత కొంత కాలంగా శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆమె మృతికి పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు నివాళులర్పించడంతోపాటు, సంతాపం తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం కావడం, శుక్రవారం మృతి చెందడంతో సాయంత్రం హైదరాబాదు నాంపల్లిలోని హజ్‌హౌస్ మసీదులో అంతిమ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆగాపుర పాన్‌మండి ఖబరస్తాన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. ఫరూక్ దంపతులకు ఐదుగురు కుమారులు ఉన్నారు.

సంపాదకీయం

రైతుపై కర్కశం

పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) గ్యారంటీకి చట్టబద్ధత కల్పించాలని పంజాబ్ సరిహద్దు శంభు, ఖనౌరి ప్రాంతాల్లో సంవత్సరం నుంచి ఏకబిగిన ఆందోళన చేస్తున్న రైతు శిబిరాలను గురువారం పంజాబ్ పోలీసులు బలప్రయోగంతో తొలగించడం దారుణం. రైతుల పోరాటాన్ని తీవ్రతరం కావించేందుకు నాలుగు నెలల నుంచి ఆమరణ నిరసన దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్‌జిత్‌సింగ్ దల్లేవాల్‌ను, మరికొంత మంది నాయకులను అదుపులోకి తీసుకొని బంధించడం దుర్మార్గం. కేంద్ర బృందంతో చర్చల సమయంలో చేపట్టిన ఈ అణచివేత చర్యతో రైతుల, రైతు ఉద్యమాల పట్ల మోడీ ప్రభుత్వ కర్కశ వైఖరి మరోసారి వెల్లడైంది. రైతులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న గుడారాలు, ట్రాలీలు, నిర్మాణాలను పోలీసులు జెసిబిలతో నేలమట్టం చేసి ఆందోళనకారులను చెల్లాచెదురు చేసి భయోత్పాతాన్ని సృష్టించింది పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం. ఏడాది నుంచి బైఠాయించిన అన్నదాతలను ఉన్నపళాన పదే పది నిమిషాల్లో ఖాళీ చేయాలని హుకుం జారీ చేసి వెనువెంటనే వేలాది మంది పోలీసులు భద్రతా బలగాలను మోహరించి ఆపరేషన్ చేపట్టడాన్ని బట్టి బిజెపి, ఆప్ చేతులు కలిపాయని భావించాలి. మోడీ సర్కారు తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన పోరాటానికి అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఆప్ మద్దతిచ్చింది. పంజాబ్‌లో అధికారంలోకి రాగానే కేంద్రంపై పోరాడుతున్న రైతులపై విరుచుకుపడింది. పార్లమెంట్ జరుగుతుండగా ఆప్ ఇటువంటి కర్కశానికి ఒడిగట్టడం గమనార్హం.

మోడీ ప్రభుత్వం రైతులను ఆగంబట్టించే, సాగును కార్పొరేట్లకు అప్పగించే వినాశకర మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దేశంపై రుద్దగా ఢిల్లీ సరిహద్దుల్లో కర్షకులు 2020-21 మధ్య సంవత్సరానికిపైగా నిరవధికంగా బైఠాయించారు. తుదకు మోడీ సర్కారు నల్ల చట్టాలను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఆ సందర్భంగా ఎంఎస్‌పికి చట్టబద్ధత సహా పలు డిమాండ్లను అమలు చేస్తానంది. ఆ హామీలను ఏళ్లు గడిచినా అమలు చేయకపోవడంతో కేంద్రం వద్ద తేల్చుకునేందుకు ఎస్‌కెఎం, కెఎంఎం ఆధ్వర్యంలో రైతులు ఢిల్లీకి పయనమవగా పంజాబ్ సరిహద్దులో వారిని పోలీసులు అటకాయించడంతో అక్కడే బైఠాయించి ఆందోళన కొనసాగిస్తున్నారు. అప్పటికీ మోడీ ప్రభుత్వం చలించకపోవడంతో రైతు నేత దల్లేవాల్ గతేడాది నవంబర్ 26న ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. దల్లేవాల్‌కు సంఘీభావంగా 121 మంది రైతులు సైతం ఆమరణ దీక్షకు కూర్చున్నారు. దల్లేవాల్ ఆరోగ్యం క్షీణిస్తుండటం, దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం కావడంతో ఎట్టకేలకు ఫిబ్రవరి మధ్యలో చర్చలకు మోడీ సర్కారు ఒప్పుకుంది. ఇంత జరిగినా ఎంఎస్‌పికి చట్టబద్ధతపై కేంద్రం కట్టుబడకపోగా, సాగిస్తున్న సాగదీత, దాటవేత, మభ్యపెట్టే ఎత్తులు ప్రభుత్వ రైతు వ్యతిరేకతను ప్రస్ఫుటిస్తోంది.

నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత రైతు పోరాటం ఒక్క మోడీ ప్రభుత్వానికే పరిమితం కాదు. ప్రభుత్వం మద్దతిస్తున్న అలాగే ప్రభుత్వానికి మద్దతిస్తున్న కార్పొరేట్లకు, కార్పొరేట్ అనుకూల విధానాలను సవాల్ చేసింది. అప్పుడు ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు మరో పోరాటం మొదలైంది. ఇప్పుడే అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ ఎన్నికయ్యాక సుంకాలపై చర్చలు ఊపందుకున్నాయి. మనం ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తులపై సుంకాలు తక్కువ వేయాలని, మనకు వచ్చే దిగుమతులపై సుంకాలు తగ్గించాలన్న డిమాండ్ అమెరికా, సామ్రాజ్యవాద దేశాల నుంచి వస్తోంది. అదే జరిగితే మన వస్తువుల ఎగుమతులు తగ్గుతాయి. మనకు వచ్చే దిగుమతులు పెరుగుతాయి. బయటి నుంచి వచ్చిన వస్తువులు మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తే దేశీయ ఉత్పత్తులకు గిరాకీ తగ్గుతుంది. ఆ మేరకు వాటిని ఉత్పత్తి చేసే రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. అమెరికాలో రైతులకు భారీ సబ్సిడీలు ఇస్తున్నారు. అందుచేత వారి సరుకులను తక్కువ ధరకు అమ్మగలుగుతారు. సుంకాల తగ్గింపు కూడా తోడైతే ఇంకా తగ్గుతాయి. ఇక్కడ మన ప్రభుత్వం ఉన్న సబ్సిడీలను ఎత్తివేసింది. ఎంఎస్‌పి కూడా అమలు చేయడం లేదు. అంటే మన రైతులు చితికిపోవడం ఖాయం. ఈ నేపథ్యంలో ట్రంప్ టారిఫ్ యుద్ధానికి సన్నద్ధమైన ఈ సమయంలోనే ఏడాదిగా ఆందోళన చేస్తున్న పంజాబ్ రైతులపై రాజ్యం అణచివేతకు పాల్పడటం యాదృచ్ఛికంగా కనిపించట్లేదు. నయా ఉదారవాద విధానాల పర్యవసానాలు ఇలానే ఉంటాయి. వాటిని వదిలించుకోకపోతే రైతుకు రక్షణ లేదు. ఈ దేశానికి ఆహార భద్రతా ఉండదు.

మహనీయుల మాట




సత్యం కోసం పోరాడడానికి
కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ
సిద్ధంగా ఉండాలి.
ఎందుకంటే
సత్యం ప్రజల ప్రయోజనాలకు
అనుగుణమైనది.

- మావో

毛泽东

వ్యాఖ్య

న్యాయబద్ధంగా పునర్విభజన ప్రక్రియ



PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

2026వ సంవత్సరం సమీపిస్తున్న కొద్దీ పార్లమెంటు, అసెంబ్లీ నియోజక వర్గాల పునర్విభజన సమస్య ప్రజల దృష్టిని ఆకర్షిస్తూ వివాదాస్పదంగా మారుతున్నది. నియోజక వర్గాలను స్తంభింపచేసిన గడువు ముగిసే సంవత్సరం ఇదే. 2026 తర్వాత నిర్వహించే తొలి జనాభా లెక్కలతో తదుపరి దఫా పునర్విభజన తప్పక చేపట్టవలసి వుంటుంది. 1976 ఎమర్జెన్సీలో ఆమోదించిన 42వ రాజ్యాంగ సవరణ ఈ విధంగా స్తంభింప చేయాలని తొలుత నిర్ణయించింది. తరువాత వాజ్‌పేయి హయాంలో ఈ స్తంభనను 2026 వరకూ పొడిగించారు.

నియోజకవర్గాల పునర్విభజనలో రెండు అంశాలున్నాయి. 1. ప్రతి పదేళ్లకోసారి జరిగే జనాభా లెక్కల తర్వాత అక్కడ నమోదైన జనాభాను జాతీయ జనాభాతో పోల్చి ఆ నిష్పత్తి ఆధారంగా ప్రతి రాష్ట్రానికి వచ్చే పార్లమెంటరీ సీట్ల సంఖ్య, అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యను పున:పరిశీలన చేయడం. 2. జనాభా రీత్యా సాపేక్షంగా సమాన స్థాయిలో వుండేలా పార్లమెంటరీ అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాదేశిక సరిహద్దులను పున:నిర్ణయించడం.

దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరం

1976 రాజ్యాంగ సవరణ, తత్పర్యవసానంగా వాజ్‌పేయి ప్రభుత్వం 2001లో చేసిన సవరణ కారణంగా 1981, 1991, 2001 దశాబ్దాల జనాభా లెక్కల తర్వాత పునర్విభజన కమిషన్లేవీ ఏర్పాటు కాలేదు. ఈ స్తంభన 2026తో ముగుస్తుంది గనక రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఈ సమస్య ముందుకొచ్చింది. తాజా జనాభా ఆధారంగా పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతుందనేది ఇక్కడ ప్రాథమికంగా వస్తున్న అభ్యంతరం.

రాష్ట్రాల జనాభా పెరుగుదల రేట్లలో హెచ్చు తగ్గులే ఈ వ్యత్యాసానికి కారణం అవుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు సమర్థవంతమైన జనాభా నియంత్రణ చర్యలతో పెరుగుదల రేట్లు బాగా తగ్గించగలిగాయి. అదే సమయంలో కొన్ని రాష్ట్రాలలో ఇది చెప్పుకోదగినంతగా పెరిగింది. దీని ఫలితమేమంటే జనాభాను అదుపు చేయడంలో జయప్రదమైన రాష్ట్రాలకు శిక్ష విధించబడుతుంది. మరో వంక ఆ పని చేయని వాటికి ఎక్కువ సీట్లను బహూకరించి నట్లవుతుంది. పంజాబ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు కూడా కొన్ని సీట్లు కోల్పోతాయని అంచనా వేస్తున్నారు. జనాభా నియంత్రణకు నాయకత్వం వహించిన దక్షిణాది రాష్ట్రాలు పునర్విభజనకు జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవడాన్ని అందుకే వ్యతిరేకిస్తున్నాయి.

పెరుగుదల దామాషా?

మీడియాలో కథనాలు వస్తున్నట్టుగా మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్యను ఇప్పుడున్న 543 నుంచి 848కి పెంచినా జనాభా ప్రాతిపదికన అయితే అయిదు దక్షిణాది రాష్ట్రాలకు 40 సీట్లు మాత్రమే పెరుగుతాయి. అదే మరోవైపున ఉత్తరప్రదేశ్ ఒక్కదానికే 63 సీట్లు, బీహార్‌కు 39 సీట్లు పెరుగుతాయి. ఈ విధంగా సీట్ల పంపిణీలో ఈ అసమానతలనే దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి.

తాజా జనాభా లెక్కల ప్రాతిపదికన పునర్విభజన ప్రక్రియ చేపట్టడం పట్ల వ్యక్తమవుతున్న ఈ వ్యతిరేకతకు సమాధానంగానే కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఏ దక్షిణాది రాష్ట్రానికీ సీట్లు తగ్గబోవనీ పైగా నిష్పత్తి సూత్రంతో పెరుగుతాయనీ పేర్కొన్నారు. అయితే ఈ ప్రకటన కూడా అస్పష్టమైందిగానే వుంది. ఎందుకంటే నిష్పత్తి సూత్రం ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం తీసుకుంటారా లేక ప్రస్తుత సీట్ల నిష్పత్తి ప్రకారమా అనే స్పష్టత లేదు. జనాభా ప్రకారమే అయ్యేట్టయితే అప్పుడు ఉత్తరాది రాష్ట్రాలకు సీట్లలో నిష్పత్తికి మించి వాటా వస్తుంది.

రెండు ప్రత్యామ్నాయాలు

ప్రస్తుత పరిస్థితిలో అనుసరించదగిన అత్యుత్తమ పద్ధతి ఏమంటే ప్రస్తుతం ఒక్కో రాష్ట్రానికి వున్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా పెంపుదల చేయడం. దీనివల్ల ప్రజలకు ప్రాతినిధ్యం వహించేందుకు మొత్తం సీట్ల సంఖ్య పెంచడంతో పాటు రాష్ట్రాల మధ్యలో ప్రస్తుతం వున్న సీట్ల నిష్పత్తిని కాపాడినట్లవుతుంది. జనాభా పెరుగుదల ప్రకారంగాక ఇప్పుడున్న సీట్ల కేటాయింపు మేరకే ప్రతి రాష్ట్రం అదనంగా సీట్లు పొందుతుంది.

> **ప్రస్తుత పరిస్థితిలో అనుసరించదగిన అత్యుత్తమ పద్ధతి ఏమంటే ప్రస్తుతం ఒక్కో రాష్ట్రానికి వున్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా పెంపుదల చేయడం. దీనివల్ల ప్రజలకు ప్రాతినిధ్యం వహించేందుకు మొత్తం సీట్ల సంఖ్య పెంచడంతో పాటు రాష్ట్రాల మధ్యలో ప్రస్తుతం వున్న సీట్ల నిష్పత్తిని కాపాడినట్లవుతుంది. జనాభా పెరుగుదల ప్రకారం గాక ఇప్పుడున్న సీట్ల కేటాయింపు మేరకే ప్రతి రాష్ట్రం అదనంగా సీట్లు పొందుతుంది.**

ఉదాహరణకు మొత్తం సీట్లు 800కు పెంచితే అప్పుడు తమిళనాడుకు వున్న 39 స్థానాలకు మరో 18 తోడై 57కు చేరుతుంది. ఆ విధంగా మొత్తం సీట్ల సంఖ్యలో ఇప్పుడున్న నిష్పత్తి అలాగే వుంటుంది. ఇదే ఫార్ములా ప్రకారం చేస్తే కేరళకు తొమ్మిది సీట్లు ఎక్కువగా పెరిగి 29కి చేరతాయి. ఇప్పుడు 80 స్థానాలున్న ఉత్తరప్రదేశ్‌కు 38 పెరిగి 118 అయితే...25 సీట్ల పెంపుతో బీహార్‌కు 79 అవుతాయి. ఇవి ఇప్పుడు వాటికి వున్న దామాషా కొనసాగింపే అవుతాయి. కనుక మరింత మెరుగైన ప్రాతినిధ్యం కోసం మొత్తం సీట్ల సంఖ్యను పెంచే సందర్భంలో ఏ రాష్ట్రం కూడా వున్న సీట్లను కోల్పోకుండా చూసినట్లు అవుతుంది. ఏమైనా ఈ పద్ధతిపై ఏకాభిప్రాయం కుదరని పక్షంలో వుండే ఒకే ఒక ప్రత్యామ్నాయం పునర్విభజన ప్రక్రియను మరో పాతికేళ్లు వాయిదా వేయడమే.

ఈ సమస్య చర్చించేందుకూ ఒక ఉమ్మడి వైఖరికి వచ్చేందుకుగాను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ మార్చి 22న దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులూ పంజాబ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ నుంచి ప్రధాన పార్టీలనూ ఆహ్వానించారు. ఈ సంయుక్త సమావేశంలో తీసుకునే వైఖరితో పునర్విభజన సమస్యకు పరిష్కారం వేగం పుంజుకోవాలి.

(మార్చి 19 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

సునీతా... విజేతా...

మిలీనియంకే రాణి విలియమ్స్
ధీరోదాత్త వనిత సునీత
పరిక్షేపణము, పరిచ్ఛేదనము మధ్య, పరిశోధకురాలుగా
సృష్టి అందాల రహస్యాలను శోధించి, చరిత్రను సృష్టించి,
చిత్ర విచిత్రాలు సాధించి,
గ్రహ గమనాలను అవలోకించి,
సునీత పయనం అబ్బురపరిచే..
గ్రహాంతరాలలో విహరించిన విలియమ్స్ విక్టరీ సత్యం...
అనంత, ఆవల, అతి సూక్ష్మము, అదేదో ఉన్నదన్న
పోతన మాట నిజం చేసి,
దానిని కనులారా వీక్షించి, ఛాయాచిత్రాలను
భువికి పంపిన సునీతమ్మ చరిత ఘనం...
విశ్వ సూక్ష్మ రేణువులు,
కుదురుగా నిన్ను కూర్చుండ లేకున్నాయో, ఏమో గాని,
ఉత్కంఠ, ఉత్కృష్ట ప్రయాణం
నవ మాసాలు మోస్తే గాని ప్రాణి బయటికి రానట్లు,
క్షణక్షణం ప్రాణగండంతో నవమాసాలు, రోదసిలో తిరిగి
ప్రాణి ఉనికి, జీవ రహస్యం తెలుసుకొని, నీవు చేసిన
గగన స్వేచ్ఛా విహారంతో,
మహిళలకు నీవు మణిహారం కాక ఇంకేమిటి?
సాంకేతికతకు నిలువెత్తు సాక్ష్యం కాక మరేమిటి?
అంత:కరణ శుద్ధి లేకుండా అంత ఆత్మబలం ఎక్కడిది?
మనోవేగం కన్నా మీ గగనయానం మిన్న,
దేవకన్యలను పలకరించావో లేదో గాని,
ఆ నునులేత స్పర్శతో, దేవకన్యగానే భువికేగిన,
నవనీత సునీతా విలియమ్స్‌కు స్వాగతం...
శూన్యంలో విహరించినా,
గగనతల రహస్యాలు ఛేదించినా,
సముద్ర తలం మీద అడుగిడినా,
ఇల చేరిన భువి ఆడపడుచుకు
ఆత్మీయ అనురాగ సంబరం
సునీతకు కోట్ల ప్రజల అభివందనం.

- డా॥.జి.వి.ఎస్. జయపాలరావు,
అధ్యాపకులు, విజయనగరం
సెల్ : 9492020115

విశ్లేషణ

పెట్టుబడిదారీ వ్యవస్థను కోలుకోనివ్వరాదు

సుదీప్ దత్తా

ఇప్పుడు ప్రపంచం అంతా పెట్టుబడిదారీ వ్యవస్థను కుదిపివేస్తున్న సంక్షోభం గురించి చర్చిస్తోంది. అయితే ఇక్కడ అతి ప్రధానమైన ప్రశ్న ఒకటి ఉండిపోయింది. ఇంత తీవ్ర సంక్షోభంలో ఇరుక్కున్న ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ ఎందుకు కూలిపోవడం లేదు?

పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభం పదే పదే ఏర్పడుతూ వుంటుంది. కాని ఎప్పుడూ పెట్టుబడిదారీ వ్యవస్థ తనంతట తానే, ఆటోమేటిక్‌గా కూలిపోలేదు. ఆ సంక్షోభం నుంచి గట్టెక్కి మళ్ళీ కొనసాగడానికి వీలుగా తనను తాను మార్చుకుంటూ మనుగడ కొనసాగిస్తోంది. ఈ విధంగా ప్రతీసారీ గట్టెక్కడానికి పెట్టుబడిదారీ వ్యవస్థ అనుసరిస్తున్న పద్ధతులేమిటో చూద్దాం. ఏ సంక్షోభం లోనుంచి అయినా బైట పడేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థకు అయిదు అవకాశాలు ఉన్నాయి.

(అ) యుద్ధం, డాలర్, భూగోళ రాజకీయాలు: యుద్ధం ప్రధాన చోదక శక్తిగా ఉండే ఆర్థిక వ్యవస్థను నడపడం, ఆయుధాల వ్యాపారాన్ని సామ్రాజ్యవాదం నేతృత్వంలో నడపడం, వీటికి తోడు దాడులకు దిగడం, బలవంతంగా సంపదను కొల్లగొట్టడం, దోపిడీ చేయడం-ఈ పద్ధతులను అనుసరించి సంక్షోభం నుండి బైట పడడానికి సామ్రాజ్యవాదం ప్రయత్నిస్తూ వుంటుంది. సైనిక బలగాల మోహరింపు, యుద్ధాలు, విద్రోహ చర్యలు, ఆర్థిక దిగ్బంధనాలు, ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్న దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసేలా జోక్యం చేసుకోవడం (ఇది మరీ ముఖ్యంగా లాటిన్ అమెరికాలో, మధ్య ప్రాచ్యంలో, ఆసియా-పసిఫిక్ ప్రాంతాలలో, యూరప్‌లో సైతం జరుగుతోంది), అమెరికా నాయకత్వంలోని సామ్రాజ్యవాదపు నగ్న రూప లక్షణాలు. గ్రీన్‌ల్యాండ్‌ను, పనామా కాలువను, గాజాను స్వాధీనం చేసుకుంటాం అంటూ తాజాగా ట్రంప్ చేస్తున్న యుద్ధ ప్రకటనలు రాబోతున్న దాడులను తెలియజేస్తున్నాయి.

పాలస్తీనా మీద 15 నెలల కాలంలో జరిగిన దాడుల్లో 48,000 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. వారిలో అత్యధికులు మహిళలు, చిన్న పిల్లలు. ఈ ఘనకార్యానికి గాను అమెరికా ఇజ్రాయిల్‌కు అందించిన సహాయం అత్యధిక స్థాయికి చేరింది. 2023, 2024 సంవత్సరాలలో అమెరికా ఇజ్రాయిల్‌కు అందించిన సహాయం ఏడాదికి 3.8 బిలియన్ డాలర్లు. ఒక్క 2022 లోనే అమెరికాలోని అతి పెద్ద మిలిటరీ కాంట్రాక్టర్లు అయిదుగురు 196 బిలియన్ల ఆదాయాన్ని ఆర్జించారు.

ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యాపై విధించిన ఆంక్షల వలన ఏర్పడిన పరిస్థితిని తమకు అనుకూలంగా వాడుకుని అమెరికన్ ఇంధన సంస్థ ఎక్సాన్ మొబిల్ 55 బిలియన్ డాలర్ల లాభాన్ని ఆర్జించింది. ఆ సంస్థ లాభాలు ఒక్కసారిగా రెట్టింపు అయ్యాయి. 2022లో షెనియర్ ఎనర్జీ అనే సహజ వాయువు వ్యాపారం చేసే సంస్థ తన లాభాలను 200 శాతం పెంచుకుంది. అంటే శతకోటీశ్వరులు యుద్ధాల వలన లాభాల పంట పండించుకుంటారన్నమాట.

అమెరికా ఆధిపత్యం చెలాయించడంలో కీలక భూమిక పోషించేది అమెరికన్ డాలర్, అమెరికా విధించే ఆంక్షలు.

అత్యధిక దేశాల వాణిజ్యం డాలర్ల రూపంలోనే సాగుతుంది. అమెరికాకు దేశీయంగా సంక్షోభం ఏర్పడితే, అది భారీగా డాలర్లను ముద్రించి విడుదల చేస్తుంది. ఆ మేరకు ఆ దేశ జాతీయ రుణం భారీగా పెరుగుతుంది (2008లో అమెరికా జాతీయ రుణం 10.7 ట్రిలియన్ల డాలర్లు ఉంటే అది కాస్తా 2023 నాటికి 33 ట్రిలియన్ల డాలర్లకు చేరుకుంది !). అయితే అన్ని దేశాలకూ డాలర్లు అవసరం కనుక ఆ డాలరు విలువ పడిపోకుండా కొనసాగుతుంది. యుద్ధం, డాలర్ అనేవి అమెరికా చేతుల్లో సంక్షోభాన్ని అధిగమించడానికి ఉపయోగపడే సాధనాలు.

(ఆ) పారిశ్రామిక రంగంలో కొత్త విభాగాలను ప్రారంభించడం: సంక్షోభం తీవ్రంగా ఉన్నప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ కొత్త పారిశ్రామిక విభాగాలను ప్రారంభిస్తుంది. ఆ ప్రత్యేక పరిస్థితుల్లో ఆ విభాగాలు అత్యంత గరిష్ట స్థాయిలో లాభాలను ఆర్జిస్తాయి. స్పెక్యులేషన్ ఎక్కువగా సాగుతున్న ప్రస్తుత యుగంలో లాభాలను ఎక్కువగా ఆర్జించే ఈ కొత్త విభాగాలపట్ల ఆకర్షణ మరింత ఎక్కువగా ఉంటుంది.



ఉత్పాదకత పెరుగుదల, లాభాల పెరుగుదల మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థకంతటికీ కాకుండా అందులోని కొన్ని పరిశ్రమలలో మాత్రమే జరుగుతుంది. ఈ పెరుగుదల సమాజ అవసరాలను తీర్చేదిగా ఉండదు.

2000 అనంతర సంక్షోభ కాలంలో ఇంటర్నెట్‌ను ఎక్కువమంది ప్రజానీకం వినియోగించేలా ప్రవేశపెట్టారు. 2008 రియల్ ఎస్టేట్ బుడగ పేలిపోయిన అనంతరం సాంప్రదాయేతర ఇంధన వినియోగం వైపు మారాలన్న చర్చ బాగా ముందుకొచ్చింది. 2024 నాటికి ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు రెండు ట్రిలియన్ల డాలర్లను దాటుతాయని అంచనా. కోవిడ్-19 సంక్షోభం సమయంలో వ్యాక్సిన్ టెక్నాలజీలో భారీగా పెట్టుబడులు పెట్టారు.

తాజాగా పెట్టుబడులు ప్రవహిస్తున్న రంగం కృత్రిమ మేధ. ఎ.ఐ. డిసెంబర్ 2024 వరకూ ఈ ఎ.ఐ సాంకేతికతపై పూర్తి ఆధిపత్యం అమెరికాకే ఉండేది. అందుచేత తక్కిన జి7 దేశాలను దాటి అమెరికా ఈ రంగంలో పెట్టుబడులు పెట్టింది. ప్రధాన ఎ.ఐ చిప్ డిజైనర్ ఎన్‌విడియా సంస్థ తన సంపద విలువను ఏకంగా ఒక ట్రిలియన్ డాలర్ల మేరకు అదనంగా పెంచుకుంది. 2024లో మొత్తం ప్రపంచ స్టాక్ మార్కెట్ల సమస్త ఆదాయంలో ఇది ఒక్కటే ఐదో వంతు. యాపిల్‌ను, మైక్రోసాఫ్ట్‌ను సైతం ఈ సంస్థ దాటి ముందుకు పోయింది. ఆల్ఫాబెట్, అమెజాన్, యాపిల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, టెస్లా-ఈ ఏడు సోషల్ మీడియా-సాఫ్ట్‌వేర్, చిప్ కంపెనీలనూ 'మాగ్నిఫిసియంట్ సెవెన్' అని పిలుస్తారు. ప్రపంచంలోని అతి పెద్ద 500 లిస్టెడ్ కంపెనీల్లోనూ ఈ ఏడింటి మార్కెట్ విలువ 12 ట్రిలియన్ డాలర్లు అయితే, తక్కిన 493 కంపెనీలూ ఎదుగూ బొదుగూ లేకుండా నిలిచిపోవడమో, దిగజారిపోవడమో జరుగుతోంది.

ఎ.ఐ సాంకేతికతపై అమెరికాకు ఉన్న స్థాయి ఆ దేశానికి చాలా ఎక్కువ వృద్ధి నమోదు కావడానికి దోహదం చేసింది. ఎ.ఐ సాంకేతికతను వినియోగించాలంటే అందుకు కావలసిన గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎన్‌విడియా వద్ద మాత్రమే ఉన్నాయి. వాటి ద్వారా మాత్రమే ఎ.ఐ వినియోగానికి కావలసిన చిప్స్ తయారౌతాయి.

అయితే, చైనాకు ఈ ఎ.ఐ చిప్స్‌ను ఎగుమతి చేయరాదని అమెరికా ఎన్ని ఆంక్షలు పెట్టినా, వాటన్నింటినీ అధిగమించి చైనా కంపెనీ హాంగ్‌జౌ జనవరి 2025లో డీప్ సీక్-ఆర్1 ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఎ.ఐ సాంకేతికతను వినియోగంలోకి తేవడానికి ఈ డీప్ సీక్ సహాయకారిగా ఉంటుంది. విడుదల అయిన నెల లోపే ఈ హాంగ్‌జౌ మార్కెట్‌లో తనకు పోటీదారులుగా ఉన్న చాట్ జిపిటి, జెమిని, క్లాడ్ వంటి సంస్థలను అధిగమించి నెంబర్ వన్ స్థానానికి వచ్చేసింది. తక్కిన కంపెనీల కన్నా డీప్ సీక్ 93 శాతం తక్కువ చార్జీలు వసూలు చేస్తుంది.

> **అంటే అమెరికన్ సరుకుల కన్నా యూరోపియన్ సరుకుల ధర ఎక్కువగా ఉంటుంది. దీనిని తట్టుకోవడానికి యూరోపియన్ దేశాలు తమ కార్మికవర్గంపై పొదుపు చర్యల పేరుతో వేతనాల కోతలను విధించడం ప్రారంభించాయి. దీని పర్యవసానంగా కలుగుతున్న ప్రజాగ్రహాన్ని అక్కడి మితవాద రాజకీయ శక్తులు వినియోగించుకుంటున్నాయి.**

డీప్ సీక్ మార్కెట్‌లో ప్రవేశించగానే ఎన్‌విడియా మార్కెట్ విలువ ఏకంగా 600 బిలియన్ల మేరకు అంతర్ధానం అయిపోయింది. మైక్రోసాఫ్ట్ షేర్ల విలువ 2.1శాతం పడిపోయింది. ఆల్ఫా బెట్ షేర్ల విలువ 4.2శాతం పడిపోయింది. డెల్ టెక్నాలజీస్ షేర్ల విలువ 8.7శాతం పడిపోయింది. యాపిల్ షేర్ల విలువ 3.18శాతం, విస్ట్రా షేర్ల విలువ 28.3శాతం పడిపోయాయి. స్పెక్యులేటివ్ మార్కెట్ ఎంత దుర్బలమైనదో, అమెరికా వృద్ధి ఎంత అస్థిరమో దీనినిబట్టి తెలుస్తోంది. ఇంకా అసలైన తుఫాను ముందే వుంది!

(ఇ) చౌకగా కార్మిక శక్తిని మార్చి ఉత్పాదకతను బాగా పెంచుకోవడం: ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ నిర్దేశించిన విధంగా ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు, సరుకులు దేశాల హద్దులను దాటి యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. అయితే అదే మోతాదులో శ్రమ (కార్మికులు) సంచరించడంలేదు. సంపన్న దేశాలలో కార్మిక శ్రమ ఖరీదుతో పోల్చితే మూడవ ప్రపంచ దేశాలలో కార్మిక శ్రమ చాలా చౌకగానే కొనసాగుతోంది. ఇది వలసకాలం నుంచి కొనసాగుతున్నదే. ఇందువలన సరుకులను ఉత్పత్తి చేసే పరిశ్రమలు సంపన్న దేశాల నుండి మూడవ ప్రపంచ దేశాలకు తమ ఉత్పత్తి కేంద్రాలను మార్చాయి. ఆ ఉత్పత్తుల బ్రాండ్లు మాత్రం తమ వద్దే అట్టిపెట్టుకున్నాయి. ఈ మార్పు ఫలితంగా అతి తక్కువ వేతనాలకే మూడవ ప్రపంచ దేశాల కార్మికుల శ్రమను కొల్లగొట్టి తమ లాభాలను అపరిమితంగా ఆ బ్రాండ్ల కంపెనీలు పెంచుకున్నాయి. దానితోబాటు మూడవ ప్రపంచ దేశాలలోని చిన్న ఉత్పత్తిదారులను బాగా దెబ్బ తీశాయి. దాని ఫలితంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ఉపాధి కోల్పోయి దుర్భర పేదరికంలోకి నెట్టబడ్డారు.

ఇంకోపక్క కొత్తగా పెంపొందుతున్న టెక్నాలజీలపై తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తూ, సరుకులకు అత్యధిక ధరలను నిర్ణయించడం ద్వారా లాభాలను పెంచుకుంటూ, సంపన్న ఉత్తరాది దేశాలు భూమండలం మీద తక్కిన ప్రాంతాలలో ఉన్న ఇతర పెట్టుబడిదారులనందరినీ వెనక్కి నెట్టేస్తున్నాయి. ప్రపంచ పెట్టుబడిపై తమ ఆధిపత్యాన్ని పెంచుకుంటున్నాయి.

ఎక్కువ పెట్టుబడి కలిగిన సంస్థలు మాత్రమే యంత్రాలపై ఎక్కువగా పెట్టుబడి పెట్టగలవు. తద్వారా ఉత్పాదకతను పెంచుకోగలవు. దాని ఫలితంగా తక్కిన పరిశ్రమల కన్నా ఎక్కువ లాభాలను అప్పటి వరకు సంపాదించగలవు. మార్కెటింగ్, అకౌంటింగ్, భూగర్భ ఇంధన నిల్వల అన్వేషణ వంటి రంగాలలో యాంత్రీకరణను ప్రవేశపెట్టి ఉత్పాదకతను, లాభాలను పెంచుకోగలవు. అంటే ఉత్పాదకత పెరుగుదల, లాభాల పెరుగుదల మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థకంతటికీ కాకుండా అందులోని కొన్ని పరిశ్రమలలో మాత్రమే జరుగుతుంది. ఈ పెరుగుదల సమాజ అవసరాలను తీర్చేదిగా ఉండదు. అదే సమయంలో సామ్రాజ్యవాద దేశాల నడుమ వైరుధ్యాలు మళ్ళీ తీవ్రం కావడం ప్రారంభమైంది. ఇప్పుడు అమెరికాకు, యూరోపియన్ యూనియన్ దేశాలకు నడుమ ఉత్పాదకత పెరుగుదల రేటులో ఉన్న తేడా నుండే ఈ వైరుధ్యం బయలుదేరింది. యూరో ప్రాంతంలో శ్రామిక ఉత్పాదకత వృద్ధి రేటు కరోనా మహమ్మారికి ముందు కాలంలో 0.5 శాతంగా ఉండేది. కరోనా అనంతర కాలంలో అది 0.2 శాతానికి పడిపోయింది. అదే అమెరికాలోనైతే వ్యవసాయేతర రంగాల్లో శ్రామిక ఉత్పాదకత వృద్ధి రేటు 1.8గా 2018 నుండీ కొనసాగుతోంది. అంటే అమెరికన్ సరుకుల కన్నా యూరోపియన్ సరుకుల ధర ఎక్కువగా ఉంటుంది. దీనిని తట్టుకోవడానికి యూరోపియన్ దేశాలు తమ కార్మికవర్గంపై పొదుపు చర్యల పేరుతో వేతనాల కోతలను విధించడం ప్రారంభించాయి. దీని పర్యవసానంగా కలుగుతున్న ప్రజాగ్రహాన్ని అక్కడి మితవాద రాజకీయ శక్తులు వినియోగించుకుంటున్నాయి.

(ఈ) కేంద్రీకరణ, కొల్లగొట్టే దోపిడీ ద్వారా గుత్తాధిపత్యాన్ని పెంచడం: సాధారణ లాభాల రేటు పడిపోతున్నప్పుడు గుత్తాధిపతులు తమకు నచ్చినట్టు సరుకుల ధరలను నిర్ణయించగలరు. తద్వారా వాళ్ళు మరింత ఎక్కువ లాభాలను ఆర్జిస్తారు. ఈ క్రమంలో బడా కంపెనీలు చిన్న కంపెనీలను సంక్షోభ సమయంలో స్వాహా చేసేస్తాయి. అదే సమయంలో గుత్త సంస్థలు జాతి సంపదలను , సహజ వనరులను కారుచౌకగా తమకు అప్పజెప్పమని ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తాయి.

ప్రపంచ అసమానతల గణాంకాలను పరిశీలిస్తే ఈ సంక్షోభ కాలంలోని ముఖ్యమైన మరికొన్ని ధోరణులు వెల్లడి అవుతాయి. 2008 నుండి చూస్తే ప్రపంచ సంపదలో అత్యంత సంపన్నులుగా ఉన్న ఒక్క శాతం సంపన్నుల వాటా ఇప్పటిదాకా 21 శాతంగానే కొనసాగుతోంది. అందులో పెద్ద మార్పు లేదు. అయితే, అత్యంత సంపన్నులుగా ఉన్న 10 శాతం మందిని తీసుకుంటే వారి వాటా 56.6 నుండి 53.5 శాతానికి తగ్గింది. అంటే, అత్యంత సంపన్నులైన ఒక్క శాతం మందీ ఆ పది శాతంలోని తక్కిన సంపన్నులను సైతం కొల్లగొడుతున్నారన్నమాట. వారి నడుమ కూడా పెట్టుబడి కేంద్రీకరణ జరిగిపోతోందన్నమాట. సంక్షోభ కాలంలో గాని, సాధారణ పరిస్థితులలో కాని గుత్తాధితుల వద్ద సంపద పేరుకుపోయే రేటు మాత్రం ఎక్కడా తగ్గలేదన్నది మరో అంశం.

(ఉ) కార్మికవర్గంపై దాడి: పైన తెలిపిన నాలుగు పద్ధతులతోబాటు భారీ నిరుద్యోగాన్ని సృష్టించడం, వేతనాలను తగ్గించడం, పని గంటలను పొడిగించడం, తద్వారా ఆర్థిక సంక్షోభ భారాలను కార్మికవర్గం పైకి నెట్టివేయడం పెట్టుబడిదారులకు అత్యంత ప్రీతిపాత్రమైన విధానం.

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్త నిరుద్యోగ రేటు 5 శాతం వద్ద ఉంది. మే 2024లో అమెరికాలో పార్ట్ టైం ఉద్యోగాలు 286,000 పెరిగాయి. అదే కాలంలో పూర్తి కాలం ఉద్యోగాలు 625,000 తగ్గిపోయాయి. ఒకటి కన్నా ఎక్కువ ఉద్యోగాలను చేస్తున్న అమెరికన్ల సంఖ్య మే నెలలో 84 లక్షలకు చేరింది. కుటుంబం గడవాలంటే ప్రతీ ఒక్కరూ రెండేసి ఉద్యోగాలు చేయవలసి వస్తోంది!

అత్యధిక జి-20 దేశాలలో నిజవేతనాలు పడిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత తీవ్ర పేదరికంలో జీవిస్తున్న కార్మికుల సంఖ్య ఒక్క నెలలోనే 10 లక్షలకు పైగా పెరిగింది. సంపదలో కార్మికుల వాటా 2019లో 52.9 శాతంగా ఉంటే అది 2022 నాటికి 52.3 శాతానికి పడిపోయింది. కార్మికుల నుండి మరింత ఎక్కువగా అదనపు విలువను పిండుకోడానికి పెట్టుబడిదారీ వర్గం చేస్తున్న ప్రయత్నాల ఫలితమే ఇదంతా. మరోపక్క ఆ కార్మికుల బేరసారాల శక్తిని హరించే విధంగా నిరుద్యోగాన్ని, భద్రత లేని ఉద్యోగాలని పెంచివేస్తున్నారు.

ఇప్పుడు మనం పెట్టుబడిదారీ వర్గం ఆర్థిక సంక్షోభం నుండి బైటపడడానికి అనుసరిస్తున్న ప్రధాన మార్గాలను గుర్తించాం. వాటి రాజకీయ పర్యవసానాలనూ గుర్తించాం. ఇక మనం ఆ మార్గాలన్నింటినీ మూసివేసి పెట్టుబడిదారీ వ్యవస్థ కోలుకోవడానికి ముందు దారి లేకుండా చేయాలి. ఇందుకోసం సంపన్న దేశాలలోని కార్మికుల పోరాటాలతో మూడవ ప్రపంచ దేశాల కార్మికులు తమ పోరాటాలను జోడించాలి. ఇప్పుడు ఉత్పత్తి పలు దేశాల్లో, పలు ప్రాంతాల్లో జరుగుతోంది. అందుచేత వివిధ దశల్లో జరుగుతున్న ఉత్పత్తికి అనుగుణంగా, ఉత్పత్తుల వారీగా, కంపెనీ వారీగా, అంతర్జాతీయ ఉద్యమాలను నిర్మించి పెట్టుబడి మెడలు వంచాలి. ఈ కొండచిలువ ఎంత పొడవున విస్తరించి వుందో అంత పొడవునా, దానిమీద దాడి జరగాలి.

(స్వేచ్ఛానుసరణ)

కిడ్నీ ఆస్పత్రిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లాలోని పలాసలోని కిడ్నీ పరిశోధనా కేంద్రం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పలు విభాగాల్లో ఒక సంవత్సరం పాటు తాత్కాలిక ప్రాతిపదికన అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆస్పత్రి అదనపు డైరెక్టర్ అల్లు పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్ 1, డయాలసిస్ టెక్నీషియన్ : 6 పోస్టులు, సి ఆర్మ్ టెక్నీషియన్ : 2 పోస్టులు, జనరల్ డ్యూటీ అటెండెంట్స్ : 3 పోస్టులు, సెక్యూరిటీ గార్డు : 1 పోస్ట్ ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు దరఖాస్తులు అదనపు డైరెక్టర్, సూపరింటెండెంట్ కార్యాలయం, కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని సంప్రదించవచ్చునని తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్‌ను పరామర్శిస్తున్న సుబ్బరావమ్మ ఇతర నాయకులు

వేధింపులు ఆపకుంటే మరో పోరాటం

- అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)

అంగన్‌వాడీలు, ఆశాలు, ఇతర స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వీటిని మానుకోకుంటే మరో పోరాటానికి సన్నద్ధమవుతామని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ హెచ్చరించారు. వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసి సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ జి.జ్యోతిని శుక్రవారం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ..టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు పల్నాడు జిల్లాలో రాజకీయ వేధింపులు తాళలేక 60 మంది అంగన్‌వాడీ టీచర్లు రాజీనామా చేశారని, కొంతమంది ఊరు వదిలి వెళ్లిపోయారని, ఇటీవల నకరికల్లు మండలంలో ఒక అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఐసిడిఎస్ పిడి ఉమాదేవి, నోడల్ ఆఫీసర్ అరుణ... సత్తెనపల్లి 27వ వార్డు అంగన్‌వాడీ సెంటర్ సందర్శనకు మధ్యాహ్నం ఒకటిన్నరకు వచ్చారని, వెళ్లిన నేపథ్యంలో మధ్యాహ్నం 12 గంటలకే సెంటర్‌ను మూసివేయాలని పిల్లలు లేరంటూ ఉద్దేశ్యపూర్వకంగానే రిమార్కు రాశారని చెప్పారు. ఉన్నతాధికారుల వేధింపులకు తట్టుకోలేక అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం చేశారని తెలిపారు. ఈ ఘటనకు కారణమైన పిడి, నోడల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెటిల్డాదేవి, జి.మల్లేశ్వరి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపి హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు వేధింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. పరామర్శించిన వారిలో ప్రజా సంఘాల నాయకులు జి.ఉమశ్రీ, పి.మహేష్, డి.విమల, జి.రజిని, కె.సుధా, జె.రాజకుమార్ ఉన్నారు.

ఆశా వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలి

- ఎపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి శుక్రవారం కలిసి ఆశాల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఆశాలను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, వారికి తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. దీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఆశాలకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు లేక అనారోగ్యంతో మృతి చెందితే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. ఇతర పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి పని చేసిన ఆశా వర్కర్లను ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందని తెలిపారు. భారత లేబర్ కాన్ఫరెన్స్‌లో స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని చేసిన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అంగీకరించినా, కానీ అమలు చేయడం లేదన్నారు.

బాధిత మహిళలకు చంద్రమ్మ పోరాటం స్ఫూర్తి

శ్రీకాకుళం జిల్లా, సంతబొమ్మాళి మండలం, గిద్దలపాడు గ్రామంలో ఆశా వర్కర్ చంద్రమ్మను అక్రమంగా తొలగించిన గ్రామ బహిష్కరణ చేసిన గ్రామ పెద్దలపై విజయం సాధించిన చంద్రమ్మ పోరాటం బాధిత మహిళలకు స్ఫూర్తి అని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి పేర్కొన్నారు. చంద్రమ్మకు అండగా నిలిచిన సిఐటియుకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అనేక చోట్ల స్కీం వర్కర్లను, ఎమ్మెల్యేల అండతో గ్రామ సమస్యలను నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి సంఘటనలు వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాలో అధికంగా జరుగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో విశ్వాసంతో పోరాడి చంద్రమ్మ విజయం సాధించినట్లు పేర్కొన్నారు.

తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గాల ఘర్షణ

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. వైసిపి కౌన్సిలర్ ఫయాజ్ బాషా తన ఇంటిని అక్రమంగా నిర్మించుకున్నారని తొలగించేందుకు మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, టిడిపి కౌన్సిలర్లు హిటాచి వాహనంతో ఫయాజ్ ఇంటికి చేరుకున్నారు. అయితే తన ఇంటికి అన్ని అనుమతులు ఉన్నాయని అధికారులను అడ్డుకున్నారు. జి ప్లస్ వన్ పర్మిషన్ తీసుకుని రెండో అంతస్తులు నిర్మించారని, కూల్చాల్సిందే అని టిడిపి కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో ఫయాజ్, టిడిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో సంప్రదించి శాంతి భద్రతలు అదుపుతప్పకుండా చర్యలు చేపట్టారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. ఈ దశలో పరిస్థితి అదుపుతప్పి ఫయాజ్ ఇంటిపై దాడి చేశారు. రాళ్లు రువ్వుతూ వాహన అద్దాలు ధ్వంసం చేశారు. ఇంటికి బిగించిన సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు.



పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ కె రత్న షీలామణి

నాగార్జున వర్సిటీలో ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు

- పలు రాష్ట్రాల నుంచి విలువిద్య క్రీడాకారులు హాజరు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆర్యా, చెరుకూరి లెనిన్ ఒల్గా మెమోరియల్ అండర్-13, అండర్-10 ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వర్సిటీ క్రీడా మైదానంలో శుక్రవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె. గంగాధర్ ప్రారంభించారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పతకాన్ని రిజిస్ట్రార్ కె.రత్న షీలామణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ పతకాన్ని రిజిస్ట్రార్ జి. సింహాచలం ఆవిష్కరించి తొలి బాణాలను సంధించి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి అండర్-13 విభాగంలో సుమారుగా 700 మంది ఆర్చర్ (బాలుర, బాలికలు) పాల్గొన్నారు. 150 మంది కోచ్‌లు, మేనేజర్లు వారి వెంట ఉన్నారు. శుక్రవారం రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ర్యాంకింగ్ పోటీలు నిర్వహించారు.

ఆరు నెలల్లో కేసు ముగించేలా ఆదేశాలివ్వండి

- తెలంగాణ కోర్టులో వైఎస్ సునీత పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్

మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు విచారణపై తెలంగాణ హైకోర్టులో వివేకా కుమార్తె సునీత పిటిషన్ దాఖలు చేశారు. సిబిఐని ఆమె ప్రతివాదిగా చేర్చారు. తన తండ్రి హత్య కేసును రోజువారీగా సిబిఐ కోర్టులో విచారించేలా ఆదేశించాలని పిటిషన్‌లో ఆమె కోరారు. దాదాపు నాలుగేళ్లుగా ఈ కేసు విచారణ కొనసాగుతున్నా.. పురోగతి ఏమీ లేదని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. హైకోర్టులో విచారణ సందర్భంగా సునీత తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. 2019 మార్చి 14న అర్ధరాత్రి ఈ హత్య చోటుచేసుకుంది. సిబిఐ అధికారులు విచారణ చేపట్టి ఇప్పటికే రెండు ఛార్జిషీట్‌లు దాఖలు చేశారన్నారు. ఇంకా సిబిఐ కోర్టులోనే విచారణ కొనసాగుతోందని.. దీన్ని ఆరు నెలల్లోగా ముగించేలా ఆదేశించాలని హైకోర్టును కోరారు. ఈ అంశంపై విచారణ జరిపిన ప్రత్యేక ధర్మాసనం సిబిఐతో పాటు ఈ కేసులో నిందితులందరికీ వ్యక్తిగతంగా నోటీసులు ఇచ్చేందుకు సునీత న్యాయవాదికి అనుమతి ఇచ్చింది. ఈ కేసు తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

- ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో లక్షలాది పౌరులకు సేవలు అందిస్తున్న సిబ్బందిని ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టాలనే ప్రభుత్వ యోచనను వెంటనే విరమించుకోవాలని, మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ కోరింది. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు సిడిఎంఎ పి.సంపత్ కుమార్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గత ఏడాది కాలంగా వరద విపత్తు వచ్చిన, అనారోగ్యం పాలైన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు పస్తులతో రోజులు గడపాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఈ సందర్భంగా సిడిఎంఎకు వివరించారు. సాధారణంగా, ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా దీర్ఘకాలికంగా చెల్లించడం లేదని, కొన్ని మున్సిపాలిటీల్లో అక్రమ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా సిడిఎంఎ సంపత్ కుమార్ మాట్లాడుతూ... ఆప్కాస్ రద్దు వ్యవహారం తన దృష్టిలో లేదన్నారు. 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందానికి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై త్వరలో ఉన్నతాధికారుల సమక్షంలో సంయుక్త సమావేశం నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తన పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సిడిఎంఎను కలిసిన వారిలో ఫెడరేషన్ అధ్యక్షులు కె.నాగభూషణం, ఉపాధ్యక్షులు కె.సోమయాజులు, బి.సోమయ్య, టి.సూర్యరాజు, ఎస్.వై నాయుడు, ప్రసాదరావు, కార్యదర్శులు ఉరుకూటి రాజు, బి.ముత్యాలరావు, కోశాధికారి ఎస్.జ్యోతిబసు, రాష్ట్ర నాయకులు ఎన్.బలరాం, ధనాల వెంకట్రావు, కె.శ్రీనివాసరావు, టి.తిరుపతమ్మ, జె.విజయలక్ష్మీ, పి.శ్రీనివాసరావు, లక్ష్మీనరసింహ, కుమారి, విజయ, వరలక్ష్మీ తదితరులు ఉన్నారు.



సిడిఎంఎ పి.సంపత్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు, నాయకులు

పెండింగ్ బకాయిలు, పిఆర్‌సి సాధన కోసం
2న కలెక్టరేట్ల ఎదుట ధర్నా

- సిఎస్‌కు ఫ్యాప్టో నోటీస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెండింగ్ బకాయిలు, నూతన వేతన సవరణ సంఘం, మధ్యంతర భృతి (ఐఆర్) సాధన కోసం ఏప్రిల్ 2న కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌కు శుక్రవారం నోటీస్ అందించామని ఫ్యాప్టో ఛైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగేళ్ల నుంచి పిఎఫ్, ఎపిజిఎల్ఐ లావాదేవీలను ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. వైద్య ఖర్చులు, పిల్లల చదువుల ఫీజులు చెల్లింపు, వివాహ ఖర్చులు మరమ్మతు వంటి వాటి కోసం పాక్షిక విత్ డ్రా కోసం దరఖాస్తులు చేసుకుని ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. అవసరాల కోసం అధిక వడ్డీలకు ఉద్యోగులు అప్పులు చేసిన పరిస్థితులు రాష్ట్రమంతటా ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు సైతం ఈ చెల్లింపులు జరగడం లేదని పేర్కొన్నారు. మరణించిన ఉపాధ్యాయుల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టలేదని, లోకల్ బాడీస్‌లో ఖాళీలు లేవనే అసంబద్ధమైన కారణం చూపి నిలుపుదల చేశారని వివరించారు. సరెండర్ లీవు బకాయిల కోసం 2022 జనవరి నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎకు అనుసంధానంగా ఇవ్వాల్సిన 5 డిఎలకు సంబంధించి పెండింగ్ బకాయిలు ఉన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇవ్వాల్సిన రెండు డిఎలను ఇప్పటికీ ప్రకటించలేదని వివరించారు. సిపిఎస్ ఉద్యోగులకు రావాల్సిన 90 శాతం డిఎ బకాయిలు, సిపిఎస్ మినహాయింపులు వారి ఖాతాల్లో జమకావడం లేదని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించాలని, ఆలోపు 30 శాతం ఐఆర్, కొత్త డిఎలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 2న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే రాష్ట్రస్థాయి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

దేశంలోనే తొలిసారిగా వృద్ధుల కోసం కేరళలో కమిషన్

తిరువనంతపురం : అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుండే కేరళ మరో ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా వృద్ధుల కోసం కమిషన్ ఏర్పాటు చేసేందుకు చట్టాన్ని ఆమోదించింది. ఈ అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు పినరయి విజయన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కొత్త కమిషన్ వృద్ధుల హక్కులు, సంక్షేమం, పునరావాసం, పరిరక్షణపై దృష్టి సారిస్తుందని చెప్పారు. ఈ కమిషన్ 2024 డిసెంబరు 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. వృద్ధులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నిర్లక్ష్యం, దోపిడీ, ఒంటరితనం వంటి సమస్యలను పరిష్కరించడానికి ఈ కమిషన్ ప్రాధాన్యతనిస్తుందని, ఈ సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన మార్గదర్శకాలను అందించే బాధ్యత కూడా దీనిపై వుంటుందని విజయన్ తెలిపారు.

పంజాబ్, హర్యానాల్లో అన్నదాతల ఆందోళనలు

- హర్యానా సిఎం షైనీ నివాసానికి భారీ ర్యాలీ

చండీగఢ్ : శంభు, కన్నౌరి సరిహద్దుల్లో రైతులను బలవంతంగా ఖాళీ చేయించి, శిబిరాలను తొలగించడం, రైతు నాయకులు అరెస్టు చేయడంపై ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం పంజాబ్, హర్యానాల్లో అన్నదాతలు నిరసనలతో కదం తొక్కారు. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ షైని నివాసానికి అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్), భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు) ఆధ్వర్యాన రైతులు ర్యాలీ నిర్వహించారు. కురుక్షేత్రలోని ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్‌కు జాయింట్ కిసాన్ మోర్చా హర్యానా నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. రుణమాఫీ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేశారు. రైతు నాయకుల అరెస్టులను ఖండించారు. వ్యవసాయ వాణిజ్య విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రణాళికను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీమా క్లెయిమ్‌లు, పంట పరిహారం, గడ్డి నిర్వహణ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. వివిధ ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన భూగర్భ చమురు పైప్‌లైన్, హెచ్‌టి విద్యుత్ లైన్, మొబైల్ టవర్లకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. గోధుమలతో సహా అన్ని రబీ పంటలకు బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ డిమాండ్లకు సిపిఎం హర్యానా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

శుక్రవారం పంజాబ్, హర్యానాలోని డిప్యూటీ కమిషనర్ల కార్యాలయాల ఎదుట రైతులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బికెయు నాయకులు రాకేష్ తికాయత్, కాంగ్రెస్ ఎంపి చరణ్‌జీత్ సింగ్, ఎస్‌ఎడి నాయకులు సుఖ్‌బీర్ సింగ్ బాదల్, రెజ్లర్ బజరంగ్ పునియా తదితర ప్రముఖులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. అరెస్టు చేసిన రైతు నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక వేత్తలకు రూ 16 లక్ష కోట్లు రుణమాఫీ చేసిన మోడీ ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ మాత్రం భారంగా భావిస్తుందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపి ధర్మేంద్ర యాదవ్ విమర్శించారు. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో కూడా రైతులు ఆందోళనలకు దిగారు. కావేరీ రైల్వే వంతెనపై రైల్ రోకో కార్యక్రమం నిర్వహించారు.

బుధవారం అరెస్టు చేసి రెస్ట్‌హౌస్‌కు తరలించిన రైతు నాయకులు జగ్జిత్ దల్లేవాల్ అప్పటి నుంచి కనీసం మంచినీరు కూడా తీసుకోవడం లేదని సమాచారం.



హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ షైనీ నివాసానికి ర్యాలీగా వెళ్తున్న రైతులు

లంచం కేసులో పవర్ గ్రిడ్ జిఎం అరెస్టు

న్యూఢిల్లీ : రూ.2.5 లక్షల లంచం కేసులో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీనియర్ జిఎం ఉదయ్ కుమార్‌ను అరెస్టు చేసినట్లు సిబిఐ అధికారులు శుక్రవారం తెలిపారు. ముంబయికి చెందిన కెఇసి ఇంటర్నేషనల్‌కు అనుకూలంగా వ్యవహరించడం కోసం ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ సుమన్ సింగ్ నుంచి ఉదయ్ కుమార్ ఈ లంచం తీసుకున్నట్లు అధికారులు చెప్పారు. రాజస్థాన్‌లోని సికార్‌లో గురువారం ఇద్దర్నీ అరెస్టు చేసినట్లు తెలిపారు. ఉదయ్ కుమార్ ప్రస్తుతం రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో పని చేస్తున్నారు. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో కెఇసి సంస్థతో పాటు మరో ఐదుగురిని నిందితులుగా పేర్కొన్నారు. కెఇసి ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు, నార్త్ ఇండియా అధిపతి జబ్రాజ్ సింగ్ కూడా నిందితుల్లో ఉన్నారని తెలిపారు.

నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలుగా నంది

విండ్‌హోక్ : ఆఫ్రికాలోని ఎడారి దేశం నమీబియాకు తొలి మహిళా అధ్యక్షురాలుగా నంది నదైత్వాహ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే తన ప్రాధాన్యత అని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో కనీసం ఐదు లక్షల ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం కనీసం ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని తెలిపారు. వ్యవసాయం, మత్స్య పరిశ్రమ, సృజనాత్మకత, క్రీడా రంగంలో ఈ ఉద్యోగాలు సృష్టించబడతాయని చెప్పారు. నవంబర్ ఎన్నికల్లో నంది పార్టీ సౌత్‌వెస్ట్ ఆఫ్రికా పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఎస్‌డబ్ల్యూఎపిఒ) 58 శాతం ఓట్లతో విజయం సాధించింది. దీంతో నంగోలో మ్బుంబా అధ్యక్షుడిగా, నంది ఉపాధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాదితో నమీబియాకు స్వాతంత్ర్యం వచ్చి 35 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో మహిళను అధ్యక్షురాలుగా నియమించాలని ఎస్‌డబ్ల్యూఎపిఒ నిర్ణయం తీసుకుంది. దీంతో నంది నదైత్వాహ అధ్యక్షురాలుగా ఎన్నికయ్యారు. నమీబియా ప్రపంచంలోనే ప్రముఖ యురేనియం ఉత్పత్తిదారుగా ఉంది. వజ్రాలు, సహజవాయువు, చమురు నిక్షేపాలు సమృద్ధిగా ఉన్నాయి. 1990లో దక్షిణాఫ్రికా నుంచి స్వాతంత్ర్యం పొందింది.

అగ్ని ప్రమాదంతో హీత్రూ ఎయిర్‌పోర్టు మూసివేత

- వేలాది విమానాల రాకపోకలు రద్దు

లండన్ : ఎల్లప్పుడూ అత్యంత రద్దీగా ఉండే బ్రిటన్‌లోని హీత్రూ విమానాశ్రయం శుక్రవారం మూతపడింది. పశ్చిమ లండన్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరగడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడమే ఇందుకు కారణమని విమానాశ్ర యం అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌కు నిప్పంటుకున్న వెంటనే ఆ మంటలను అదుపు చేసేందుకు పది అగ్నిమాపక యంత్రాలు రంగంలోకి దిగాయి. ఈ ప్రమాదం కారణంగా వేలాది ఇళ్లు అంధకారంలో వున్నాయి. సమీప ప్రాంతాల్లోని వారిని ఖాళీ చేయించారు. పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకోవడం కనిపిస్తోంది. ఈ ప్రమాదం కారణంగా హీత్రూ ఎయిర్‌పోర్టులో వందలాది విమానాల రాకపోకలకు ఆటంకం కలగగా, వేలాదిమంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. లండన్ రావాల్సిన విమానాలను పారిస్, ఐర్లాండ్‌లోని విమానాశ్రయాలకు దారి మళ్లించారు. ఇప్పటికి 1350 విమానాల రాకపోకలు ప్రభావితం కాగా, అమెరికా నగరాలకు వెళ్లే విమానాలు చాలావరకు రద్దయిపోయాయి.

విద్యా శాఖ రద్దు!

- ఉత్తర్వులపై ట్రంప్ సంతకాలు

వాషింగ్టన్ : విద్యా శాఖను రద్దు చేస్తున్న ఉత్తర్వులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం సంతకాలు చేశారు. తద్వారా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఫెడరల్ విద్యా శాఖను మూసివేసి, రాష్ట్రాలకు, స్థానిక కమ్యూనిటీలకు తిరిగి అధికారాలను అప్పగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ మంత్రి లిండా మెక్‌మహన్ ఈ సందర్భంగా చెప్పారు. చట్టం అనుమతించిన మేర అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మొత్తంగా ఒక శాఖను రద్దు చేయడమంటే ఆషామాషీ వ్యవహారం కాదని, దీనికి కాంగ్రెస్ అనుమతి కావాల్సి వుంటుందని ఆమె పేర్కొన్నారు. 1979లో ఏర్పడిన ఈ విద్యా శాఖ ప్రధానంగా తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన విద్యార్థులకు సాయపడేందుకు, విద్యార్థులకు రుణాలు అందించే కార్యక్రమాలను చూస్తుంది. కాలేజీలు, పాఠశాలలకు ఫెడరల్ ప్రభుత్వం నుండి అందే నిధులే ఇక్కడ కీలక పాత్ర పోషిస్తున్నాయి. పిల్లలను దోచుకుంటున్నారని హక్కుల కార్యకర్తలు, డెమొక్రాట్ సభ్యులు తీవ్రంగా విమర్శించారు. ట్రంప్ ఈ చర్యను పూర్తిగా అమలుపరచలేరని, వంద సీట్లు గల సెనెట్‌లో కనీసం 60మంది మద్దతు అవసరమని విమర్శకులు పేర్కొంటున్నారు.

టిటిడిలోని అన్యమతస్తులను బదిలీ చేస్తాం

మొదటిపేజి తరువాయి

ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. అన్నదానం చేస్తే వచ్చే తృప్తి వెలకట్టలేనిదన్నారు. తిరుమలతో అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు ప్రారంభించారని గుర్తు చేశారు. ఎస్‌వి అన్నదానం ట్రస్ట్‌కు రూ.2,200 కోట్లు కార్పస్ ఫండ్ విరాళంగా వచ్చిందని తెలిపారు. దేశ, విదేశాల్లోని తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమలలోని ఏడుకొండలు శ్రీవారి సొంతమన్నారు. తిరుమలలో అపవిత్ర కార్యకలాపాలు నిర్వహించడం, వ్యాపార ధోరణితో చూడడం తగదని అన్నారు. విలేకర్ల సమావేశంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ జె.శ్యామలరావు, అడిషనల్ ఇఒ సిహెచ్ వెంకయ్యచౌదరి పాల్గొన్నారు. అనంతరం రెండు రోజుల పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన చంద్రబాబుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సాదర వీడ్కోలు పలికారు. వారిలో టిటిడి ఇఒ శ్యామలరావు, డిఐజి షిమోషి బాజ్పాయ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, భాను ప్రకాష్, కోనేటి ఆదిమూలం, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు ఉన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టడానికా?

- రైతులపై స్టాండింగ్ కమిటీ నివేదిక పక్కన పెట్టడంపై ప్రతిపక్షాల ఆగ్రహం
- కార్పొరేట్లకు లక్షల కోట్లు మాఫీ చేస్తూ అన్నదాతకు మొండిచేయేల?
- పార్లమెంట్‌లో వెల్లువెత్తిన ఆగ్రహం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతులపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నివేదికను మోడీ ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలో పడేసిందని ప్రతిపక్ష ఎంపిలు విమర్శించారు. రైతు సమస్యలను మోడీ సర్కార్ పట్టించుకోవటం లేదని, రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ఇస్తేనే రైతుల ఆత్మహత్యలను నివారించవచ్చునని చెప్పారు. లోక్‌సభలో శుక్రవారం జరిగిన చర్చలో సిపిఎం ఎంపి కె రాధాకృష్ణన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి సంబంధించిన డిమాండ్స్ అండ్ గ్రాంట్స్‌ను వ్యతిరేకిస్తున్నానని చెప్పారు. రైతులు చాలా సమస్యలను ఎదుర్కొంటున్నారని, కానీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల కష్టాలు, సమస్యలకు సంబంధించి పరిష్కార మార్గాన్ని చూపించని విధంగా డిమాండ్స్ అండ్ గ్రాంట్స్ ఉన్నాయని విమర్శించారు. కేవలం అంకెల్లోనే ఉన్నాయని, కానీ రైతులకు మేలు కోసం అవి లేవని అన్నారు. రైతులు ఆత్మహత్యలు, ఎంఎస్‌పి, రుణమాఫీ వంటి సమస్యలపై ఒక్క అక్షరం కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పదేళ్లలో 1.7 లక్షలకు పైగా రైతుల ఆత్మహత్య

డిఎంకె ఎంపి టిఎస్ సెల్వగణపతి మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలను ఆపడానికి ఎంఎస్‌పి ఇవ్వాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ నివేదికను స్పష్టం చేసిందని, కానీ గ్రామీణ ఓటర్లు ఈ పాలనకు ఓటు వేయకపోవడంతో ప్రభుత్వం అన్ని నివేదికలనూ కోల్డ్ స్టోరేజీలలో పెడుతున్నదని విమర్శించారు. పెద్ద ఎత్తున కార్పొరేట్లకు రుణమాఫీ చేసిన ప్రభుత్వం, దేశానికి అన్నం పెట్టే రైతులకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని పంటలకూ 50 శాతం ఎంఎస్‌పి, 80 కోట్ల మంది రైతులకు రుణ మాఫీ, విత్తనాల ఖర్చును కవర్ చేసే పంట బీమా పథకం చేర్చనందున వ్యవసాయ మంత్రిత్వ శాఖ డిమాండ్లను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. "ట్రెజరీ బెంచ్‌ల నేతత్వంలోని వ్యవసాయంపై స్టాండింగ్ కమిటీ రైతు ఆత్మహత్యలను అంతం చేయడానికి రుణ మాఫీ ఇవ్వవలసి ఉందని పేర్కొంది. గత పదేళ్లుగా 1.7 లక్షలకు పైగా రైతులు మరణించారు. అయినా మోడీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు" అని సెల్వగణపతి అన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో నిధుల కోతను ఎన్‌సిపి (శరద్ పవర్) ఎంపి అమోల్ రామ్సింగ్ కోల్హే ప్రశ్నించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో 23 శాతం నిధుల కోత జరిగిందని అన్నారు. "సోయాబీన్‌కు క్వింటాలుకు రూ.6,000 ధర ఇస్తానని ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. 20 శాతం మంది రైతులకే రూ.4,800 ఇచ్చారు. మిగిలిన రైతులు మరింత తక్కువ ధరకు పంటను అమ్మాల్సి వచ్చింది" అని ఆయన అన్నారు.

బిజెపికి రైతుల పట్ల ద్వేషం : ఎస్‌పి

ఎస్‌పి ఎంపి ధర్మేంద్ర యాదవ్ మాట్లాడుతూ బిజెపికి రైతుల పట్ల ద్వేషం ఉందని, రైతులకు నిధుల కోతలో ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. ప్రభుత్వ మండీలు నిర్మించలేదని అన్నారు. మూడు వ్యవసాయ బిల్లు రద్దుకు వ్యతిరేకంగా ఢిల్లీలో ఆందోళన చేసిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని, పురుగు మందులు, ట్రాక్టర్లపై జిఎస్టితో రైతులను ప్రభుత్వం దోపిడీ చేస్తోందని విమర్శించారు. ఆర్‌జెడి ఎంపి సుధ్కర్ సింగ్ మాట్లాడుతూ "బీహార్‌కు మండీలు అవసరం. మండీలు లేకుండా రైతుల ఆదాయం పెరగదు" అని ఆయన అన్నారు. బీహార్‌లో జనుము, కొబ్బరి కోసం నిర్మించిన బోర్డు ఎక్కడున్నాయని ప్రశ్నించారు.

రైతుల ఆందోళనపై ప్రభుత్వాల అణచివేతను కాంగ్రెస్ ఎంపి చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఖండించారు. రైతులు న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన చేస్తుంటే, ప్రభుత్వం అణచివేస్తోందని విమర్శించారు. పంటలకు ఎంఎస్‌పి ధరలను నిర్ణయించడంపై కమిటీని ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా పురోగతి లేదని అన్నారు. "ఈ దేశంలోని రైతులను నాశనం చేయాలని బిజెపి నిర్ణయించుకుంది" అని చన్నీ విమర్శించారు.

కథలే.. కథలు..!

- 24 గంటల కథా మారథాన్
- నేటి సాయంత్రం 5.30 గంటల నుంచి
- యూట్యూబ్ ఛానెల్ 'బి ప్లస్ విత్ భాస్కర్'లో..
- వందమందికి పైగా కథకులు, రచయితల భాగసామ్యం

విజయవాడ : మీకు కథలు అంటే ఇష్టమా.. ఎవరైనా ఆసక్తిగా కథలు చెబుతుంటే వినాలని ఉంటుందా..? అయితే ఈ వార్త మీ కోసమే..! ప్రపంచ కథా దినోత్సవాన్ని పురస్కరించుకుని 24 గంటల కథా మారథాన్‌ను నిర్వహించనున్నారు. తెలుగు కథకుల బృందం కథాకళ ఈ మారథాన్‌ను యూట్యూబ్ ఛానెల్ 'బి ప్లస్ విత్ భాస్కర్'లో శనివారం సాయంత్రం 5:30 నుంచి నిర్వహించనుంది. భారత్, అమెరికా, కెనడా, కువైట్, యుఎఇ, కతార్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, దక్షిణాఫ్రికా, బోట్సవానా, ఐర్లాండ్ తదితర దేశాల నుంచి వందకు పైగా కథకులు, రచయితలు, అతిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నారు. ప్రఖ్యాత కథలు, పౌరాణిక ఇతిహాసాలు, ఆధునిక కథలతోపాటు ఈ ఏడాది కథా దినోత్సవం థీమ్ డీప్ వాటర్ (అనంత జలనిధి)ను ప్రతిబింబించే కథలు, అనుభవాలు కూడా ఉంటాయి. ప్రముఖ రచయితలు అద్దంకి శ్రీనివాస్, తనికెళ్ల భరణి, సత్యం మందపాటి, వంగూరి చిట్టెంరాజు, వోలేటి పార్వతీశం, వసంతలక్ష్మి అయ్యగారి ప్రారంభోపన్యాసాలతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది.

కథకులు నారాయణ స్వామి శంకగిరి, మనోస్మణి శ్రీనివాస్, లక్ష్మీ రాయవరపు, లావణ్య బాలాంత్రపు, విజయ్ జీడిగుంట, ప్రసాద్ జోస్యుల, శ్రీ కరుణ గాదిరాజు, లలితా శాస్త్రి తదితరులు కథలు చెబుతారు. రెండు సెషన్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం 5:30 గంటల నుంచి ఆదివారం ఉదయం 5:30 గంటల వరకూ ఒక సెషన్ ఉంటుంది. రెండో సెషన్ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉంటుంది.

గాజాపై ఇజ్రాయిల్ దారుణాలు ఆపండి

- జంతర్ మంతర్ వద్ద నిరసన
- కేంద్ర ప్రభుత్వ మౌనాన్ని ప్రశ్నించిన వక్తలు



జంతర్‌మంతర్ వద్ద నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గాజాపై ఇజ్రాయిల్ దాడులు అమానవీయమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు సుభాషిణి అలీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ క్రూరమైన దాడులకు వ్యతిరేకంగా పాలస్తీనా సాలిడారిటీ ఆర్గనైజేషన్ శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టింది. పాలస్తీనా ప్రజల పోరాటానికి మద్దతు ఇవ్వాలని పాలస్తీనా సాలిడారిటీ ఆర్గనైజేషన్ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సుభాషిణి అలీ మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దురాగతాలపై మోడీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ప్రశ్నించారు. ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఉల్లంఘనను, గాజాలో అమాయక పౌరులపై నిరంతర హత్యాకాండను ఖండించారు. అమెరికా మద్దతు ఉన్న సామ్రాజ్యవాద దోపిడీని విమర్శించారు. అమాయక పిల్లలు, పౌరులను చంపడం మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరమని అన్నారు. సిపిఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దురాక్రమణను ఖండిస్తూ ప్రపంచ సమాజం పాలస్తీనాకు సంఘీభావంగా నిలబడాలని పిలుపునిచ్చారు. భారతదేశ ప్రజలు ఎల్లప్పుడూ అణచివేతను, అన్యాయాన్ని వ్యతిరేకిస్తున్నారని అన్నారు. నేటికీ పాలస్తీనాకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లిం ప్రజలపై అమెరికా అండతో ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించిందని విమర్శించారు. ఈ దాడిలో 450 మందికి పైగా చనిపోయారని, వందలాదిమంది క్షతగాత్రులయ్యారని అన్నారు. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయస్థానాల తీర్పును గౌరవించాలని చెప్పారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించారు. పాలస్తీనా పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఇండియా ప్రభుత్వం.. ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా దృఢమైన వైఖరి తీసుకోవాలని, పాలస్తీనా ప్రజలకు మద్దతును పునరుద్ధాటించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు ఆయుధ సరఫరాలను నిలిపి వేయాలని, భారతీయ కార్మికులను ఇజ్రాయిల్‌కు పంపడం ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇండియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శాంతిని ప్రేమించే ప్రజలందరూ ఇజ్రాయిల్ దురాక్రమణ కు వ్యతిరేకంగా తమ స్వరాలను వినిపించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు అజీజ్ పాషా, ప్రముఖ విద్యావేత్త అచిన్ వినాయక్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఆర్ అరుణ్ కుమార్, సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఐద్వా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీమతి టీచర్, మరియం ధావలే, ఎఐకెఎస్ నేత హన్నన్ మొల్లా, సిఐటియు నేత ఎం సాయిబాబు, జెఎన్‌యుఎస్‌యు అధ్యక్షులు ఐషీ ఘోష్ పాల్గొన్నారు.

సిపిఎం జాతీయ మహాసభకు మదురై ముస్తాబు

- 1న పతాకావిష్కరణ
- 2న మహాసభ ప్రారంభం, కవాతు ఎగ్జిబిషన్, సాంస్కృతిక ప్రదర్శన
- 3న సెమినార్‌కు విజయన్, స్టాలిన్ రాక
- 4న వెట్రిమారన్, విజయ్ సేతుపతిల సాంస్కృతిక ప్రదర్శన
- 6న భారీ బహిరంగ సభ, ప్రదర్శన



సెంట్రల్ చెన్నై జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన సిపిఎం మహాసభ ప్రచార సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్

మదురై : ఏప్రిల్ 2 నుండి 6వరకు జరగబోయే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) 24వ మహాసభలకు ప్రాచీన నగరం మదురై వేదిక కాబోతోంది. ఇప్పటికే నగరమంతా అరుణ పతాకాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. దేశవ్యాప్తంగా రానున్న 819 మంది ప్రతినిధులకు, పరిశీలకులకు స్వాగతమివ్వడానికి సిద్ధమైంది. తమిళనాడు వ్యాప్తంగా పర్యటించిన అమరవీరుల జాతాలు మహాసభల ప్రారంభానికి ముందు ఏప్రిల్ 1వ తేదీ సాయంత్రానికి సభా స్థలి వద్దకు చేరుకోగానే వేలాదిగా ప్రజలు వాటికి స్వాగతం పలుకుతారు. ఆ తర్వాత పార్టీ పతాకావిష్కరణ జరుగుతుంది. ఏప్రిల్ 2వ తేదీ ఉదయం తముక్కమ్ ఓపెన్ గ్రౌండ్స్‌లో మహాసభ ప్రారంభం కానున్నాయి. వేలాదిమంది రెడ్ వలంటీర్లు కవాతు నిర్వహిస్తారు. మహాసభల ప్రారంభానికి ముందుగా విప్లవ భావాలను రగిల్చేలా పాటలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. ఏప్రిల్ 2వ తేదీ సాయంత్రం ఫాసిజం వ్యతిరేక దృశ్యమాలిక, భారతదేశ వైవిధ్యత, భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలను తెలిపే ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుంది. అదే రోజు సాయంత్రం ప్రముఖ నటులు, దర్శకులు సముద్రఖని, శశికుమార్‌ల నేతృత్వంలో ఆహూతులను ఆకర్షించేలా విప్లవ భావజాలాన్ని మిళితం చేసిన కళా రూపాలు ప్రదర్శితమవుతాయి.

ఇక మహాసభల రెండో రోజైన 3వ తేదీన ప్రతినిధులు సైద్ధాంతిక వైఖరులు, రాజకీయ వ్యూహాలపై చర్చలు జరుగుతాయి. తముక్కమ్ ఓపెన్ గ్రౌండ్స్‌లో రాష్ట్రాల హక్కులపై ప్రత్యేక సెమినార్ జరుగుతుంది. ప్రతిపక్షాల ఐక్యతను ప్రదర్శించేలా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కర్ణాటక మంత్రి బైరె గౌడ ఈ సెమినార్‌కు హాజరు కానున్నారు. కొడియెరి బాలకృష్ణన్ పేరిట ఏర్పాటు చేసిన ప్రతినిధుల ప్రాంగణంలో సమకాలీన రాజకీయ సవాళ్లపై కీలకమైన చర్చలు కొనసాగుతాయి.

ఏప్రిల్ 4వ తేదీన పార్టీ సైద్ధాంతిక, నిర్మాణపరమైన అంశాలపై లోతైన చర్చలు కొనసాగుతాయి. ఆ సాయంత్రం ప్రముఖ దర్శకులు వెట్రిమారన్, ప్రముఖ నటులు విజయ్ సేతుపతిల సాంస్కృతిక ప్రదర్శనలు వుంటాయి. ఏప్రిల్ 5వ తేదీన తీర్మానాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి కేంద్రీకరిస్తారు. ఫాసిస్ట్ శక్తులను ఎదుర్కొనేందుకు, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు ఉద్దేశించిన కార్యాచరణను పార్టీ రూపొందిస్తుంది. ఆ సాయంత్రం కె.పి.జానకి అమ్మాళ్ సాంస్కృతిక వేదికపై ప్రగతిశీల భావాలు కలిగిన ప్రకాష్ రాజ్, మారి సెల్వరాజ్, జ్ఞానవేల్, రోహిణిల బృందం ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

ఇక చివరి రోజైన ఏప్రిల్ 6వ తేదీన తీర్మానాలు ఆమోదించడం, కామ్రేడ్ సీతారాం ఏచూరి పేరిట ఏర్పాటు చేసిన వేదికపై మహాసభల ముగింపు వుంటుంది. ఆ తర్వాత అందరూ ఎంతగానో ఎదురుచూసే రెడ్ వలంటీర్ల బ్రహ్మాండమైన ప్రదర్శన నిర్వహించబడుతుంది. 25వేల మంది రెడ్ వలంటీర్లు మదురై నగర వీధుల్లో చేసే కనువిందైన ప్రదర్శనతో నగరమంతా ఎర్ర సముద్రంగా మారిపోతుంది.

అనంతరం కామ్రేడ్ ఎన్.శంకరయ్య పేరిట వందియార్ రింగ్ రోడ్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలి వద్దకు చేరుకోవడంతో ప్రదర్శన ముగుస్తుంది. బహిరంగ సభలో దాదాపు 2లక్షల మంది పాల్గొంటారని భావిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.షణ్ముగం అధ్యక్షతన జరిగే బహిరంగ సభలో ఆహ్వానసంఘం కార్యదర్శి, ఎంపి.వెంకటేశన్ స్వాగతోపన్యాసం చేస్తారు.

అనంతరం మహాసభల సందేశాన్ని ప్రజలకు తెలియచేస్తూ, వారిలో విప్లవ స్ఫూర్తిని రగిల్చేలా పార్టీ నేతలు ప్రకాష్ కరత్, పినరయి విజయన్, బృందా కరత్, జి.రామకృష్ణన్, ఆహ్వాన సంఘం చైర్మన్ కె.బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు వాసుకి, సంపత్‌లు ప్రసంగిస్తారు.

ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మళ్లీ పోరాటాన్ని ప్రారంభించాలన్న పిలుపుతో ఈ మహాసభలు ముగుస్తాయి. విభజన శక్తులు సమాజ పొందికకు ముప్పుగా పరిణమిస్తున్న తరుణంలో 24వ పార్టీ మహాసభ ఆశకు, ఐక్యతకు ఒక ఆశాకిరణంలా నిలుస్తుంది.

ఇండోనేషియాలో ముగ్గురు భారతీయులకు ఉరి?

జకర్త : మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ముగ్గురు భారతీయులకు ఇండోనేషియాలో మరణశిక్ష విధించారు. భారత్‌కు చెందిన రాజు ముత్తుకుమారన్ (38), సెల్వదురై దినకరన్ (34), గోవింద సామి విమల్‌కందన్ (45) సింగపూర్‌లోని షిప్పింగ్ పరిశ్రమలో పని చేశారు. లెజెండ్ అక్వేరియన్ కార్గో నౌక ద్వారా 106 కిలోల క్రిస్టల్ మెత్‌ను అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఆరోపణలతో గతేదాడి జులైలో ఇండోనేషియా అధికారులు అరెస్టు చేశారు. ఈ నెల 14 జరిగిన విచారణలో కోర్టు వీరికి మరణశిక్ష విధించినట్లు ఇండోనేషియా మీడియా వెల్లడించింది. విచారణ సాగుతోందని, ఏప్రిల్ 15న తుది తీర్పు వస్తుందని డిఫెన్స్ లాయర్ తెలిపారు.

జస్టిస్ యశ్వంత్ వర్మపై చర్యలు తీసుకోవాలి

- ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు)

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో లెక్కకు మించి నోట్ల కట్టలు బయటపడిన నేపథ్యంలో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రాసిక్యూట్ చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్, జనరల్ సెక్రటరీ నల్లూరు మాధవరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయపరమైన ప్రక్రియను అనుసరించి అభిశంసించి విధుల నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సిజెఐ, సుప్రీంకోర్టు కొలీజియం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అతనిని సొంత హైకోర్టు అయిన అలహాబాద్‌కు బదిలీ చేయడం పరిష్కారం కాదని, రాజ్యాంగ అంశాలను నిర్ధారించే కోర్టుల్లో అవినీతిపరులు న్యాయమూర్తులుగా ఉంటే అది స్వతంత్ర న్యాయ వ్యవస్థకే మరణశాసనంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల పట్ల, న్యాయ వ్యవస్థ ప్రజల్లో నమ్మకం కూడా ఇలాంటి వారివల్ల దెబ్బతింటుందని పేర్కొన్నారు.

న్యాయమూర్తి నివాసంలో నోట్ల కట్టలు

మొదటిపేజి తరువాయి

ఆయన ఇంటిలో లేరు. 82 సంవత్సరాల తల్లి, కుమార్తె మాత్రమే ఉన్నారు. వారిచ్చిన సమాచారంతో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు ఓ గదిలో పెద్ద మొత్తంలో నగదు కన్పించింది. అందులో కొంత నగదు ప్రమాదంలో కాలిపోయింది. సంఘటనకు సంబంధించిన సమాచారాన్ని వారు ఉన్నతాధికారులకు చేరవేశారు. ప్రభుత్వాధికారులు ఈ ఉదంతాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. దీంతో ఆయన కొలీజియంను సమావేశపరిచి పరిస్థితిపై చర్చించారు. కొలీజియంలో ప్రధాన న్యాయమూర్తితోపాటు సీనియర్ న్యాయమూర్తులైన బిఆర్ గవాయ్, సూర్యకాంత్, అభయ్ ఎస్ ఓకా, విక్రమ్ నాథ్ సభ్యులుగా ఉన్నారు. జస్టిస్ వర్మ శుక్రవారం కేసుల విచారణ చేపట్టలేదని, సెలవు పెట్టారని ఆయన కోర్టు సిబ్బంది తెలియజేశారు. జస్టిస్ వర్మ 2006 నుండి పదోన్నతి పొందే వరకూ అలహాబాద్ హైకోర్టుకు ప్రత్యేక కౌన్సిల్‌గా పనిచేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర చీఫ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కూడా పనిచేశారు. 2013లో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. 2021 అక్టోబర్ 11 నుంచి ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆయన మాకొద్దు : అలహాబాద్ హైకోర్టు బార్ కౌన్సిల్

జస్టిస్ యశ్వంత్ వర్మను తమ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనను అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ (హెచ్‌సిబిఎ) వ్యతిరేకించింది. ఈ ప్రతిపాదనను చూస్తుంటే 'అలహాబాద్ హైకోర్టు ఏమైనా చెత్తబుట్టా అనే ప్రశ్న తలెత్తుతోంది' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. అవినీతి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. న్యాయమూర్తుల నియామకం విషయంలో బార్ అసోసియేషన్‌ను ఎన్నడూ సంప్రదించలేదని తెలిపింది.

బదిలీ ప్రారంభం మాత్రమే : సిజెఐ

జడ్జి బదిలీ ప్రారంభం మాత్రమేనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తోటి న్యాయమూర్తులతో అన్నారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ వ్యవహారంలో అవసరమైతే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అది ఎవరి సొమ్ము : కాంగ్రెస్

నగదు పట్టుబడిన ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు జడ్జిని బదిలీ చేసినంత మాత్రాన సరిపోదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి నుండి పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకోవడం తీవ్రమైన విషయమని కాంగ్రెస్ మీడియా - ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా అన్నారు. 'జస్టిస్ వర్మ ఉన్నావ్ లైంగిక దాడి కేసును, అనేక తీవ్రమైన కేసులను విచారిస్తున్నారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం కలిగించాలంటే అది ఎవరి డబ్బు, దానిని జడ్జికి ఎందుకు ఇచ్చారు అనేది తెలియాల్సి ఉంది' అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడుతూ ఇడి, సిబిఐ వంటి దర్యాప్తు సంస్థల కంటే అగ్నిమాపక దళమే మంచి పనిచేసిందని వ్యాఖ్యానించారు.

జనాభా లెక్కలు ఎందుకు దాటవేస్తున్నారు?

మొదటిపేజి తరువాయి

కానీ మనం చరిత్రలో జీవిస్తున్నామని పేర్కొన్నారు. నాగ్‌పూర్‌లో ఇటీవల జరిగిన అశాంతిని ప్రస్తావిస్తూ 'ఈ దేశానికి అతిపెద్ద శత్రువు 300 సంవత్సరాల క్రితం మరణించిన ఔరంగజేబ్' అని ఎద్దేవా చేశారు. రాష్ట్రాల హక్కులను హరించడం, ఢిల్లీలో ప్రతిదీ కేంద్రీకరించడం అనే పరిస్థితి ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదానికి హానికరమని బ్రిట్టాస్ ఎత్తి చూపారు. కేరళ నుండి ఎనిమిది బిల్లులను, తమిళనాడు నుండి 11 బిల్లులను గవర్నర్లు అడ్డుకున్నారని విమర్శించారు. ప్రధానమంత్రి ఆయా రాష్ట్రాల్లో పర్యటించి, స్వయంగా హామీ ఇచ్చినా... కేరళకు రావాల్సిన రూ.849 కోట్లు, తమిళనాడుకు రావాల్సిన రూ.2,152 కోట్లు పంపిణీ కాలేదని పేర్కొన్నారు. త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని పట్టుబడుతున్న కేంద్ర ప్రభుత్వం, ఉత్తర భారత రాష్ట్రాల్లో దక్షిణ భారత భాషలను బోధించడానికి సిద్ధంగా ఉందా? అని బ్రిట్టాస్ ప్రశ్నించారు. 300 సంవత్సరాల క్రితం మరణించి ఖననం చేయబడిన ఔరంగజేబును పునరుత్థానం చేయడం వెనుక ఉన్న రాజకీయాలపై బ్రిట్టాస్ నిలదీశారు. 'ఎలోన్ మస్క్ ఎఐ 'గ్రోక్' కూడా ఈ చర్య రాజకీయ లబ్ధి కోసమే అని చెబుతోందని పేర్కొన్నారు. ఈ సమయంలో అమిత్ షా జోక్యం చేసుకుని బ్రిట్టాస్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. బ్రిట్టాస్ తన ప్రసంగాన్ని కొనసాగించి, ప్రభుత్వంపై పదునైన విమర్శలు చేశారు.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలేం చేస్తున్నాయి? : ఆప్

నేరాలను ఆపడం రాష్ట్రానికి సంబంధించిన అంశం, కానీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ బిజెపికి చెందినవని, కానీ నేరాలను ఎందుకు ఆపలేకపోతున్నారని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ప్రశ్నించారు. తాను ఉటంకిస్తున్న డేటా అంతా ఎన్‌సిఆర్‌బి నుండి వచ్చిందేనని, బిజెపి పాలిత రాష్ట్రాల్లో నేరాలు ఎక్కువగా ఉన్నాయని చూపించే డేటాను ఉటంకిస్తూ అన్నారు. దీంతో అధికార పార్టీ ఎంపిలు ఆందోళనకు దిగారు. 'ప్రపంచం అంతరిక్షానికి చేరుకుంది. దాని సాంకేతిక పురోగతిని మెరుగుపరుస్తోంది. కానీ మీరు సమాధులు తవ్వడంలో బిజీగా ఉన్నారు' అంటూ బిజెపి ఎంపిల ద్వేషపూరిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఔరంగజేబ్ సమాధి బద్దలు కొట్టాలనుకుంటే మీ పిల్లల్ని పంపండి : సంజయ్‌రౌత్

శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ మాట్లాడుతూ.. 'హోంమంత్రిత్వ శాఖ అసమ్మతివాదులను బలహీనపరుస్తూ, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేస్తూ, ప్రత్యర్థులను కొనుగోలు చేయడానికి పోలీసుల సహాయం తీసుకుంటుంటే, నిజమైన పని, అంటే శాంతి భద్రతలు, ఐక్యత వంటివి ఎవరు చేస్తారు? మణిపూర్ మండుతూనే ఉంది. ఇప్పుడు మహారాష్ట్ర కూడా మండుతోంది' అని ఆయన అన్నారు. 'నాగ్‌పూర్ చరిత్రలో 300 సంవత్సరాలలో ఎప్పుడూ అల్లర్లు జరగలేదు. ఇప్పుడు నాగ్‌పూర్ వంటి నగరంలో... అది కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ నియోజకవర్గంలో అల్లర్లు జరుగుతున్నాయి. మీరు ఔరంగజేబు సమాధిని బద్దలు కొట్టాలనుకుంటే, దానిని బద్దలు కొట్టండి, మిమ్మల్ని ఆపిందెవరు? కేంద్రంలోనూ మహారాష్ట్రలోనూ మీ ప్రభుత్వమే' అని ఆయన అన్నారు. దాని కోసం 'మీ పిల్లలను పంపండి, మా పిల్లలను కాదు. కానీ మీ పిల్లలు విదేశాలలో చదువుతున్నారు. పనిచేస్తున్నారు. మీరు పేద పిల్లల మనసులను ఎందుకు ప్రభావితం చేస్తున్నారు' అని ఆయన ప్రశ్నించారు.

అవినీతిని కప్పిపుచ్చడానికే భాషా సమస్యంటూ అమిత్ షా ఎదురుదాడి

డిసెంబర్ తరువాత వివిధ రాష్ట్రాల ప్రజలతో వారి మాతృభాషల్లోనే లేఖలు మార్పిడి చేసుకుంటానని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. కొంతమంది తమ అవినీతిని దాచడానికి భాషా సమస్యను లేవనెత్తుతున్నారని చెప్పారు. తమిళనాడులో ఎన్‌డిఎ అధికారంలోకి వస్తే తాము తమిళంలో వైద్య, ఇంజినీరింగ్ విద్యను అందుబాట్లోకి తీసు కొస్తామన్నారు. హిందీ అన్ని భారతీయ భాషలకు స్నేహితు డు, ఇతర భారతీయ భాషలను బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. అంతర్గత భద్రత పటిష్టతకు కేంద్రప్రభు త్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, 2026 మార్చి 21 నాటికి దేశంలో పూర్తిగా నక్సలిజాన్ని నిర్మూలిస్తామని చెప్పారు. నక్సలిజం రాజకీయ సమస్య మాత్రమేనని భావించే వారిని చూస్తే తనకు జాలి కలుగుతుందన్నారు. జమ్మూకాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను కేంద్రం రద్దు చేసిన తరువాత ఉగ్రవాదంలో యువకుల ప్రమేయం దాదాపు కనుమరుగైందని చెప్పారు.



మీకోసం

నీటిలో కొద్దిగా వంట సోడా కలిపి, ఆ నీటిలో వంటపాత్రలు, ప్లేట్లు, స్పూన్లు, గరిటెలు కడిగితే వాటికి పట్టిన వాసన పోతుంది.

జీవన సౌరభం

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండి.

రైలుబండి



ఎక్కండి ఎక్కండి
సొగసైన రైలు
చూడండి చూడండి
ఆకు పచ్చని బైలు

ఊలేసి కదిలింది
ఊళ్ళనే దాటింది
పట్టాల పైనుండి
పరుగులే తీసింది

కొండలను చూపింది
బండలను చూపింది
పరిగెత్తినట్టున్న
తరువులను చూపింది

ఎక్కండి ఎక్కండి
సోకైన రైలు
మలుపులో చూడాలిరా
దాని స్టైలు!

గోదారి దరి దాటి
కృష్ణమ్మతటి మీటి
పచ్చపచ్చని చెట్ల
పందిళ్ళనే దాటి

రాగాలు పాడుతూ
రైతువలె కదిలింది
సాగుభూముల మధ్య
చెమటతో సాగింది!

ఎక్కండి ఎక్కండి
చక్కనౌ బండి
ప్రక్కలను పరచి
మిము జోకొట్టునండి!

బహురాష్ట్ర యాత్రికులు
భారతీయత చాటు
పెక్కు భాషల వారు
జాతీయతను చాటు

ఎక్కండి ఎక్కండి
మన రైలుబండి
ఏకతాసూత్రాన్ని
ఇది చాటు లెండి!

– కిలపర్తి దాలినాయుడు,
సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రామభద్రపురం.

కో.. కో..

పిల్లలూ, ఇక్కడ కొన్ని ఇంగ్లీషు పదాలు ఇచ్చాం. అవన్నీ ఒకే తెలుగు అక్షరంతో మొదలవుతాయి. ఉదాహరణకు ఒకటి ఇచ్చాం. మిగతావి మీరు రాయండి.

monkey	కోతి
fort	--
tribes	--
want	--
cutting	--
a joyfull play with two sticks	--

నేను గీసిన బొమ్మ





కడియం పరిమళ ,
7వ తరగతి
, MPPUP స్కూల్, నడవపల్లి,
డా.. బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేసవి వ్యాధులు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేసవి ఎండలతో అనేక రుగ్మతలు వ్యాపిస్తుండటం సహజం. డీ హైడ్రేషన్ నుంచి ఫుడ్ పాయిజనింగ్ వరకూ కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చాలా వ్యాధులు వైరస్‌ల వల్ల వస్తాయి. పరిశు భ్రతకు ఎక్కువ శ్రద్ధ వహించాలి. తరచుగా చేతులు, కాళ్లు కడుక్కోవాలి. ప్రయాణం చేసేటప్పుడు హ్యాండ్ శానిటైజర్ ఉపయోగించటం మర్చిపోవద్దు. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవటం చాలా అవసరం. వేసవిలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల వివరాలు ఇవిగో ...



వడదెబ్బ (సన్‌స్ట్రోక్) : ఎండలో ఇష్టానుసారంగా తిరిగినా, నీరు తక్కువగా తీసుకున్నా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల కంటే ఎక్కువగా ఉన్నా, అయోమయం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, చెమట పట్టకపోవటం, కాళ్ళూ చేతుల నొప్పులు, శరీరం తిమ్మిరి, వాంతులు, తలనొప్పి, స్పృహకోల్పోవటం వంటివి వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తి శరీరాన్ని చల్లబర్చాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడవాలి. నీళ్లు తాగించి వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లటం ఉత్తమం. ఈ సమస్య రాకుండా ఉండాలంటే నీరు ఎక్కువగా తాగాలి. నిమ్మరసం, కొబ్బరినీరు, గ్లూకోజ్ డి వంటివి తీసుకోవాలి. ఇంట్లో ఎలక్ట్రోరల్ పౌడర్ లేదా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఉంచుకోండి. అవి అందుబాటులో లేకపోతే చక్కెర, ఉప్పు కలిపిన నీరు తాగండి.

విషాహారం (ఫుడ్‌పాయిజనింగ్) : ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు వేసవిలో సాధారణం. ఇవి ఎక్కువగా హానికారక బ్యాక్టీరియా, పరాన్నజీవుల వల్ల వస్తాయి. అధిక వేడికారణంగా ఆహారం త్వరగా పాడవుతుంది. అలాంటి ఆహారం తీసుకోవటం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంటుంది. ఆహారం చెడిపోకుండా చూసుకోవాలంటే బాగా ఉడికించాలి. వండిన ఆహారాన్ని బయట వేడిలో ఉంచినప్పుడు బ్యాక్టీరియా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించేందుకు తాజా ఆహారాన్ని తినటం ముఖ్యం. మసాలాలతో కూడిన ఆహారాన్ని తగ్గించాలి.

కంటి ఇన్ఫెక్షన్ : ఈ కాలంలో కనిపించే కొన్ని సాధారణ కంటి వ్యాధుల్లో కంటి వాపు, అలెర్జీ, కంజక్టివైటిస్ ఉంటాయి. తగినంత విశ్రాంతి కళ్లకు ఇవ్వాలి. వాటిపై ఒత్తిడి తగ్గించాలి. మీ కళ్ళు, ముఖాన్ని క్రమం తప్పకుండా శుభ్రమైన నీటితో కడగాలి. ఎండలో బయటకు వెళ్తే కళ్లజోడు వాడటం మంచిది. సమస్యలు వస్తే డాక్టరు సిఫారసు మేరకు ఐడ్రాప్స్, మందులు వాడాలి.

చర్మ సమస్యలు : సూర్యుడి అతినీలలోహిత కిరణాలు వల్ల చర్మంలోని కణాలు దెబ్బతింటాయి. ఎండలో ఎక్కువగా తిరిగితే చర్మం కమిలిపోతుంది. అధిక తేమ, వేడి కారణంగా చర్మంపై ఎరుపు దద్దుర్లు, స్వేద గ్రంథులు మూసుకుపోవటం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. చెమట వల్ల మచ్చలు, దురద మంట వస్తుంది. చర్మ సమస్యలు రాకుండా ఉండా లంటే వేసవిలో సన్‌స్క్రీన్ లోషన్లు వంటివి కూడా ఉపయోగించొచ్చు. వాడిన దుస్తులను ఉతక్కుండా మళ్లీ వాడకూడదు. చెమట ఎక్కువగా పడుతున్నం దున స్నానం రెండుమూడు సార్లు చేయొచ్చు. శరీరానికి గాలి తగిలేలా వదులైన, చెమట పీల్చే కాటన్ దుస్తులు ధరించటం మేలు.

అతిసార : ఎండవేడి కారణంగా ఆహారం త్వరగా పాడైపోతుంది. అలాంటి ఆహారం తీసుకుంటే వేసవిలో విరోచనలు సాధారణం. కలుషిత ఆహారం తినటం, నీరు తాగటం, మద్యపాన అలవాట్లు డయేరియాకు దారితీస్తాయి. అతిసారం నుంచి దూరంగా ఉండటానికి నీటిని మరిగించిన తర్వాత మాత్రమే తాగటం అలవాటుగా చేసుకోవాలి. కూరగాయలను ముక్కలుగా చేయటానికి ముందు, తర్వాత వాటిని బాగా కడగాలి. ఇళ్లల్లో ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. పాడైనవి కాకుండా వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవటం మేలు.

చికెన్‌పాక్స్ : చికెన్‌పాక్స్ (అమ్మోరు) చాలా సాధారణ వేసవి వ్యాధుల్లో ఒకటి. ఇది అధిక జ్వరంతో శరీరంపై ఎరుపురంగులో ఉండే చిన్న దద్దుర్లు రూపంలో ప్రారంభమవుతుంది. ఇది పిల్లల్లో తక్కువ రోగ నిరోధకశక్తి ఉన్న వారిలో సాధారణంగా కనిపిస్తుంది. ఇది అంటువ్యాధి. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇది సోకినప్పుడు బయటకు తిరగకుండా ఇంట్లో ఉండటమే మేలు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. త్వరగా తగ్గే వీలుంది.

తట్టు : మీజిల్స్ మరో సాధారణ వేసవి వ్యాధి. మీజిల్స్‌కు కారణమయ్యే పారామిక్సో వైరస్ వేసవిలో వేగంగా సంతానోత్పత్తి చేస్తుంది. దీని ప్రారంభ లక్షణాలు దగ్గు, అధిక జ్వరం, గొంతునొప్పి, కళ్ళు ఎర్రబడటం, తరువాతి దశలో, చిన్న తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. మీజిల్స్ దద్దుర్లు శరీరం అంతటా కనిపిస్తాయి. మందులు వాడితే తగ్గిపోతుంది.

కామెర్లు : నీటి ద్వారా సంక్రమించే వ్యాధి. ఇది హైపటైటిస్ ఎ వల్ల వస్తుంది. ప్రధానంగా కలుషిత మైన ఆహారం, నీటి వినియోగం వల్ల వస్తుంది. సకాలంలో చికిత్స చేయకపోతే ఈ వ్యాధి కాలేయం పనితీరును ప్రభావితం చేస్తుంది. ఇది పిత్తం అధిక ఉత్పత్తికి దారితీస్తుంది.

టైఫాయిడ్ : జ్వరం వస్తే సొంత వైద్యంతో నిర్లక్ష్యం చేయొద్దు. జ్వరంతోపాటు తలనొప్పి, నీరసంగా ఎక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అపరిశుభ్ర ఆహారం, నీరు తీసు కోవటం వల్ల ఈ సమస్య వస్తుంది. కలుషిత ఆహారం, నీటి వనరులు బ్యాక్టీరియాకు సంతానోత్పత్తికి ప్రదేశంగా మారతాయి. టైఫాయిడ్ వస్తే బలహీనత, ఆకలిలేకపోవటం, కడుపులో నొప్పి, అధిక జ్వరం వంటి లక్షణాలు కన్పిస్తాయి.

గవదబిళ్ళలు : వేసవి వ్యాధుల్లో గవదబిళ్లలు అత్యంత అంటువ్యాధి. ఈ వైరల్ వ్యాధి పిల్లలను ప్రభావితం చేస్తుంది. ఈ అంటువ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వ్యాపిస్తుంది. లాలాజల గ్రంథివాపు, కండరాలనొప్పి, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవటం, బలహీనత వంటి లక్షణాలు కన్పిస్తాయి.

తలనొప్పి : అధిక ఉష్ణోగ్రతలతో తలనొప్పి ఎక్కువగా కనిపిస్తుంది. వేడి వల్ల వచ్చే తలనొప్పి శరీరం వేడికి ప్రతి స్పందించటం వల్ల కూడా వస్తుంది.

పైన పేర్కొన్న వ్యాధులకు అధునాతనమైన మందులు అందుబాటులో ఉన్నాయి. డాక్టరు సలహా మేరకు వాటిని ఉపయోగిస్తే అవి నియంత్రణలోకి వస్తాయి.



ఈ చిట్కాలు పాటించండి

- తరచూ మంచినీరు, నిమ్మకాయ ద్రావణంతోపాటుగా ఎక్కువ మజ్జిగ తీసుకోవాలి
- నారింజ, దానిమ్మ వంటి పండ్లను తినాలి
- మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ బయటకు వెళ్లకండి
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి సూర్యకాంతికి గురి కావడాన్ని తగ్గించండి. ఉదయం లేదా సాయంత్రం మాత్రమే వ్యాయామం వంటి కార్యక్రమా లను చేయండి.
- కళ్ల సంరక్షణ కోసం కూలింగ్ గ్లాసులు పెట్టుకోవాలి
- లేతరంగు, తేలికైన వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి
- బ్యాక్టీరియాతో ఉండే స్ట్రీట్‌ఫుడ్ తినొద్దు
- ప్యాకింగ్ చేసిన పండ్లు, కూరగాయలు తీసుకోవద్దు
- పండ్లు, కూరగాయల వినియోగాన్ని పెంచండి.
- ఆల్కాహాల్, కెఫైన్ తీసుకోవద్దు
- కూల్‌డ్రింక్స్ తాగొద్దు.




– డాక్టర్ జి.అర్చన మాధురి,
ఎంబిబిఎస్, ఎండి డివిఎల్,
డెర్మటాలజిస్ట్,
కాస్మోటిక్ కేర్ స్పెషలిస్ట్,
విజయవాడ



'దిల్'రాజు పాన్ ఇండియా ప్రాజెక్టు

నిరంతరం కొత్తదనానికి ప్రాధాన్యత ఇచ్చే ప్రముఖ నిర్మాత దిల్‌రాజు పాన్ ఇండియా ప్రాజెక్టును చేపట్టబోతున్నారు. 'మార్కో' సినిమా దర్శకుడు హనీఫ్ అదేనితో కలిసి మల్టీస్టారర్ మూవీని తెరకెక్కించనున్నారు. శిరీష్ సమర్పణలో 'దిల్'రాజు ప్రొడక్షన్స్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షితరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మలయాళంలో 'మార్కో' సినిమాను దర్శకుడు హనీఫ్ అదేని తెరకెక్కించగా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీతో హనీఫ్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. గురుఫిల్మ్స్ సునీత తాటి ఈ ప్రాజెక్టులో భాగస్వామి అయ్యారు. మిగతా వివరాలు త్వరలోనే తెలియజేస్తామని మేకర్లు తెలిపారు.

న్యూయార్క్ శిక్షణలో గౌతమ్



చిత్రసీమలో ఘట్టమనేని కృష్ణ కుటుంబానిది విభిన్న శైలి. సూపర్‌స్టార్ కృష్ణతోపాటుగా విజయ నిర్మల, రమేష్‌బాబు, మహేష్‌బాబు తదితరులు నటించి మెప్పించారు. టాలీవుడ్ ప్రముఖ నటుల్లో మహేష్‌బాబు కూడా ఒకరు. ఇప్పుడు ఆయన తనయుడు గౌతమ్ న్యూయార్క్‌లోని ప్రముఖ యూనివర్శిటీలో శిక్షణ పొందుతున్నాడు. నేర్చుకున్న యాక్టింగ్ స్కిల్స్‌ను వీడియోల రూపంలో ఇటీవల కొన్నింటిని షేర్ చేస్తున్నాడు. వాటిలో తాజాగా చేసిన ఓ స్కిట్‌లో అదరగొట్టాడు. తోటి విద్యార్థులతో కలిసి అతడు చేసిన ఈ స్కిట్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. వీడియో ప్రారంభంలో నవ్వుతూ కనిపించిన గౌతమ్ కొద్ది క్షణాల్లోనే ఆగ్రహావేశాలకు లోనై డైలాగులు చెబుతూ కనిపించాడు. గ్రాడ్యు యేషన్‌ను పూర్తిచేసిన గౌతమ్ తన తండ్రి బాటలోనే నటుడిగా రాణించాలని ఆశిస్తున్నాడు. గతంలో లండన్‌లో తొలి స్టేజి షో ఇచ్చాడు. మహేష్‌బాబు కథానాయకుడిగా నటించిన '1 నేనొక్కడినే..' సినిమాలో బాలనటుడిగా రంగ ప్రవేశం చేశాడు.

'సింగిల్' పోస్టర్ విడుదల



శ్రీ విష్ణు కథానాయకుడిగా దర్శకుడు కార్తీక్‌రాజు తెరకెక్కిస్తున్న సినిమా 'సింగిల్'. ఇవానా, కేతికా శర్మ కథానాయికలు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్‌చౌదరి నిర్మిస్తున్నారు. మే 9న ఈ సినిమా విడుదల చేయబోతున్నామని తెలియజేస్తూ నిర్మాతలు పోస్టర్ విడుదల చేశారు. వెన్నెల కిశోర్ కీలకపాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ కుటుంబ సమేతంగా, మరీ ముఖ్యంగా యువతను ఆకట్టుకునేలా, అలరించేలా ఈ సినిమా ఉంటుందన్నారు. ఈ వేసవిలో శ్రీ విష్ణు తన నవ్వులతో ప్రేక్షకులను అలరించబోతున్నారన్నారు. ఆయన పాత్రలోని రెండు డిఫరెంట్ వేరియేషన్స్ ఆకట్టు కుంటాయని వివరించారు.



నటి రజితకు మాతృవియోగం

ప్రముఖ నటి రజిత మాతృమూర్తి విజయలక్ష్మి (70) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్టులుగా పనిచేసిన కృష్ణవేణి, రాగిణి ఆమెకు సోదరీమణులు. రజిత కుటుంబం సినీరంగంతో బలమైన సంబంధాలను కలిగివుంది. విజయలక్ష్మి మృతికి సినీరంగ ప్రముఖులు, నటీనటులు తీవ్ర సంతాపం తెలిపారు. రజిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ఏప్రిల్ 25న 'ఎర్రచీర' విడుదల

సుమన్‌బాబు, కారుణ్య చౌదరి జంటగా నటించిన సినిమా 'ఎర్రచీర'. 'ది బిగినింగ్' అనేది ట్యాగ్‌లైన్. సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు సాయి తేజస్విని కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఏప్రిల్ 25న విడుదల కానుంది. సుమన్‌బాబు స్వీయ దర్శకత్వంలో నిర్మించడమే కాకుండా ఇందులో కీలకపాత్ర పోషించారు. మదర్ సెంటిమెంట్, హారర్, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌తో రూపుదిద్దుకున్న ఈ సినిమా గత శివరాత్రికి విడుదల కావాల్సివుంది. విఎఫ్‌ఎక్స్ వర్క్ పూర్తి కాకపోవటంతో అప్పట్లో విడుదల వాయిదా పడింది. ఇప్పుడు వేసవి కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

నేటినుంచి ఐపిఎల్ సంగ్రామం

- ప్రారంభోత్సవ వేడుకలకు ఈడెన్ గార్డెన్స్ సిద్ధం
- ప్రధాన ఆకర్షణగా షారుక్ ఖాన్
- కోల్‌కతా-బెంగళూరు మ్యాచ్‌తో సీజన్-18 ఐపిఎల్ ప్రారంభం
- రాత్రి 7.30గం॥లకు స్టార్‌స్పోర్ట్స్‌లో



కోల్‌కతా: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-18కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలి మ్యాచ్‌కు ముందు ప్రారంభోత్సవ వేడుకలు జరగ నున్నాయి. ఈ వేడుకలు సుమారు 40నిమిషాల సేపు సాగనున్నట్లు సమాచారం. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే వేడుకలకు బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. విరాట్ కోహ్లి-అనుష్క శర్మ కూడా ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. గత ఏడాది ఎన్నికల దృష్ట్యా ప్రారంభోత్సవ వేడుకలు దుబాయ్ వేదికగా జరిగాయి. ఐపిఎల్ 18వ సీజన్ నేడు ఈడెన్ గార్డెన్స్‌లో షురూ కానుంది. ఆరంభ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్, కోల్‌కత నైట్‌రైడర్స్ తలపడనున్నాయి. ఆటగాళ్ల మెగా వేలంతో అన్ని జట్లు సరికొత్తగా కనిపిస్తుండగా.. డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కత నైట్‌రైడర్స్ నాల్గో టైటిల్‌పై కన్నేసి బరిలోకి దిగుతుండగా.. తొలి టైటిల్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోరాటానికి సై అంటోంది.

ఆరంభ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

ఐపిఎల్ ఆరంభ వేడుకలకు ప్రత్యేకత ఉంది. ప్రతి సీజన్‌కు నిర్వాహకులు అభిమానులను మరింతగా అలరించే కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది బాలీవుడ్ నటీ దిశా పటాని నృత్య ప్రదర్శన హైలైట్‌గా నిలువనుంది. శ్రేయ ఘోషల్, కరణ్ అహుజా ఆట పాటలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 35 నిమిషాల పాటు ఓపెనింగ్ సెర్మానీ వేడుక సాగనుంది. మ్యాచ్ టాస్ 7 గంటలకు పడనుండగా.. ఓ 60 నిమిషాల ముందే ఆరంభ వేడుకలు ఆరంభం కానున్నాయి.

స్పిన్ సవాల్

ఐపిఎల్18 సీజన్‌లో నేడు తొలి మ్యాచ్. ఆటగాళ్ల మెగా వేలం, జట్టు సమీకరణాల్లో మార్పులు.. సారథ్య బాధ్యతల్లో కొత్త రక్తం వెరసి నేడు నైట్‌రైడర్స్, రాయల్ చాలెంజర్స్ పోరు మరింత ఆసక్తికరంగా మారింది. అజింక్య రహానె కోల్‌కతకు కెప్టెన్‌గా వ్యవహరించనుడగా.. రజత్ పాటిదార్ బెంగళూర్‌కు సారథ్యం వహిస్తున్నాడు. ఓపెనింగ్, మిడిల్ ఆర్డర్ సహా బౌలర్ల కూర్పుపై ఆసక్తి కనిపిస్తోంది. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ మరోసారి థ్రిల్లింగ్ ముగింపులను అందించేందుకు ఎదురుచూస్తోంది.

వర్షం ముప్పు

ఐపిఎల్ సీజన్ ఆరంభ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. వాతావరణ శాఖ 'ఆరెంజ్' హెచ్చరిక జారీ చేయగా.. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం మెండుగా ఉంది. కోల్‌కతలో బుధవారం, గురువారం సైతం వర్షం కురిసినా.. ఇరు జట్లు ప్రాక్టీస్ చేశాయి. శుక్రవారం రాత్రి సైతం ఈడెన్‌గార్డెన్స్‌లో వర్షం కురిసింది. మైదాన సిబ్బంది పిచ్‌పై కవర్లు కప్పి ఉంచారు. వర్షం కారణంగా మ్యాచ్‌కు ఆటంకం కలిగితే.. ఆఖరుకు ఐదు ఓవర్ల మ్యాచ్ సాధ్యపడేందుకు వీలుగా నిబంధనలు ఉన్నాయి. వర్షంతో మ్యాచ్ రద్దు అయితే ఇరు జట్లు చెరో పాయింట్ పంచుకోనున్నాయి.

కేఎల్ రాహుల్ తొలి రెండు మ్యాచ్‌లకు దూరం

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐపిఎల్ 2025 తొలి రెండు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. అతని భార్య అథియా శెట్టి మొదటి బిడ్డకు జన్మనివ్వనుండటమే దీనికి కారణం. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా మహిళా జట్టు కెప్టెన్ అలిస్సా హిలీ ఓ యూట్యూబ్ ఛానల్ వేదికగా తెలిపారు. బ్రూక్, కెఎల్ రాహుల్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లతో కూడిన ఢిల్లీ జట్టు బలంగానే ఉంది. కేఎల్ రాహుల్‌ను వేలంలో ఢిల్లీ యాజమాన్యం రూ.12కోట్లకు కొనుగోలు చేసింది. ఢిల్లీ జట్టు లక్నోతో 24న విశాఖపట్నం వేదికగా తొలి మ్యాచ్ ఆడనుంది.

రాజస్థాన్ సారథిగా రియాన్ పరాగ్

ఐపిఎల్ సీజన్-18 రాజస్థాన్ రాయల్స్ ఆరంభ మ్యాచ్‌లను తమ రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ కాకుండా యువ ఆల్‌రౌండర్ రియాన్ పరాగ్ కెప్టెన్సీలో ఆడనుంది. తొలి మూడు మ్యాచ్‌లకు పరాగ్ సారథిగా వ్యవహరిస్తాడని గురువారం రాజస్థాన్ మేనేజ్‌మెంట్ ఓ ప్రకటనలో తెలిపింది. సంజూ జట్టుతో ఉన్నా ప్యూర్ బ్యాటర్‌గానే కొనసాగుతాడని పేర్కొంది.

ఆలిండియా సివిల్ సర్వీసెస్ టిటి టోర్నీ
ఎపి సచివాలయ ఉద్యోగులకు పతకాలు



న్యూఢిల్లీ: ఆలిండియా సివిల్ సర్వీసెస్ టేబుల్ టెన్నిస్(టిటి) టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఉద్యోగులు కాంస్య పతకాలు సాధించారు. మహిళల డబుల్స్ వెటరన్ విభాగంలో మద్దా బేబీ సరోజిని-సహదేవ సత్యవతి జంట కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఫైనల్లో మహారాష్ట్రను ఓడించారు. ఇక వ్యక్తిగత విభాగంలో మద్దా బేబీ సరోజిని రెండు కాంస్య పతకాలు సాధించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయం తరపున టేబుల్ టెన్నిస్ పోటీల్లో పతకాలు సాధించిన ఘనత వీరికే దక్కింది. మద్దా బేబీ సరోజిని వెలగపూడి సచివాలయంలో మైనారిటీస్ విభాగంలో అసిస్టెంట్ సెక్రటరీగా, సహదేవ సత్యవతి జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్లు కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలు మార్చి 16 నుంచి 20వరకు న్యూఢిల్లీ త్యాగరాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగాయి.

ఛేదనలో పాకిస్తాన్ రికార్డు
మూడో టి20లో న్యూజిలాండ్‌పై ఘన విజయం

అక్లాండ్: టి20ల్లో పాకిస్తాన్ సరికొత్త రికార్డు సృష్టించింది. ఆక్లాండ్ వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టి20లో 205 పరుగుల లక్ష్యాన్ని పాక్ కేవలం 16 ఓవర్లలోనే ఛేదించింది. దీంతో టి20 క్రికెట్ చరిత్రలో అత్యంత వేగంగా 200కు పైగా లక్ష్యాన్ని 16ఓవర్లలోనే ఛేదించిన తొలి జట్టుగా పాకిస్తాన్ రికార్డుపుటల్లోకెక్కింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68